ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు



ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నైతిక విలువలతో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావు, ఎంపీడీవో యాదగిరిలు అన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని పటాన్‌చెరు మండలంలోని ఐనోల్ శివారులో గల టీఆర్ఆర్ మెడికల్ కళాశాల, పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వేరువేరుగా జరిగిన స్వీప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు చైతన్య పరుస్తూ మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్‌లో విద్యార్థులు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. అనంతరం విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 ఏండ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్యం బలోపేతం అయ్యే విధంగా భాగస్వాములై తమ ఓటు హక్కును వినియోగిం చుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల అధికారులు సంతోష్, అమరేందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, మాస్టర్ ట్రైనర్ యోగి బాబు, స్వీప్ నోడల్ అధికారి నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 1

మెదక్

శనివారం | 02 మార్చి 2024 | www.navatelangana.com

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తద్వారా తల్లిదండ్రు లకు, ఉపాధ్యాయులకు గొప్ప కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని శ్రీ వాగ్దేవి హై స్కూల్‌లో శుక్రవారం జరిగిన వాగ్దేవి హైస్కూల్ వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి ఉన్నత విలువలతో విద్యార్థులను తీర్చిదిద్దడంలో పాఠశాల యాజమాన్యాన్ని తాను మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుండ్ల మహేందర్ రెడ్డి, బీరప్ప యాదవ్, వాగ్దేవి హై స్కూల్ కరస్పాండెంట్ ఉదయ్ భాస్కర్ రెడ్డి, కేవీఆర్ హై స్కూల్ కరస్పాండెంట్ హరికృష్ణా రెడ్డి, గ్లోరియస్ హై స్కూల్ కరస్పాండెంట్ సింహాచలం, వశిష్ట మోడల్ స్కూల్ కరసా

ఎమ్మెల్యే లాస్య నందిత మృతి కేసులో టిప్పర్ గుర్తింపు

- కర్ణాటక నుంచి పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- పోలీసుల అదుపులో టిప్పర్ డ్రైవర్

నవతెలంగాణ-పటాన్‌చెరు



కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత (37) ఇటీవల పటాన్ చెరు ఓఆర్ఆర్ పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విధితమే. అయితే ఆమె మృతికి కారణమైన టిప్పర్‌ను కర్ణాటకలో పటాన్‌చెరు పోలీసులు గుర్తించారు. వెంటనే ఆ టిప్పర్‌ను పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే కారు అతివేగంగా వచ్చి టిప్పర్‌ను ఢీకొనడం వల్లే మృతి చెందినట్లు టిప్పర్ డ్రైవర్ చెప్పినట్లు సమాచారం.

బైకు, లారీ ఢీ.. ఇద్దరు మృతి, ఒకరికి తీవ్రగాయాలు



నవతెలంగాణ-తొగుట

బతుకుదెరువు కోసం వచ్చి ప్రమాదానికి గురై ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన మండల కేంద్రం సమీపంలో చోటుచేసుకుంది. శుక్రవారం ఎస్ఐ బి. లింగం తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు యువకులు కెఎస్ఆర్ కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నారు. అజయ్ కుమార్ (22), విద్యాసాగర్ (22), సచిన్ కుమార్ (19) ముగ్గురు బైక్ పై తుక్కాపూర్ నుండి తొగుట వైపునకు వెళ్తున్నారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ బైక్ ను బలంగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అజయ్ కుమార్, విద్యాసాగర్ ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఉన్న సచిన్ కుమార్ ను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాదుకు తరలించినట్లు తెలిపారు. మృతి చెందిన విద్యాసాగర్ తమ్ముడు అగు పంకజ్ నగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెత్త బుట్టల వినియోగంపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఝరాసంగం



ప్రభుత్వం అందించిన చెత్త బుట్టలను తప్పకుండా వినియోగించాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించే పద్ధతులపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించినట్టు డాక్టర్ రమ్య, జీవశాస్త్రం ఉపాధ్యాయులు రామ్ చందర్ భీమ్ వంశీ అన్నారు. కరిగిపోయే చెత్త.. కరిగిపోని చెత్త పాఠ్యాంశాన్ని స్థానిక జీవశాస్త్ర ఉపాధ్యాయులు విద్యార్థులతో హాస్పిటల్ సందర్శించి క్షేత్ర పర్యటనలో భాగంగా ప్రయోగాత్మకంగా, ప్రత్యక్షంగా చూపించి వారికి చెత్త ఉపయోగించే పద్ధతులపై సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐదు రకాల చెత్తబుట్టలను వినియోగిస్తామని విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపిస్తూ వివరించారు. ఎర్ర చెత్తబుట్టలో మానవ రక్త వ్యర్థ పదార్థాలను, తెల్లని చెత్త బుట్టలో పదునైన సూదులు పీపీటి వస్తువులు,నీలి చెత్తబుట్టల లోహాలకు సంబంధించిన వ్యర్థాలను వేస్తారన్నారు. ఆకుపచ్చ లేదా నల్లని చెత్తబుట్టలో సాధారణ వ్యర్థ పదార్థాలను, చెత్తను వేస్తారని వివరించారు. చెత్తబుట్టలో వ్యర్థాలు వేయడం వల్ల రోగాలు రాకుండా పర్యావరణాన్ని కాపాడుకుంటూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడం జరుగుతుందని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ సుదర్శన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కర్ణాటక బస్సుల అతివేగంతో తరచూ ప్రమాదాలు



నవతెలంగాణ-జహీరాబాద్

కర్ణాటక ఆర్టీసీ డ్రైవర్లు అతివేగంతో బస్సులు నడుపుతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి జహీరాబాద్ మండలం దిడ్గి గ్రామ సమీపంలో సొన్నాయిల ప్రశాంత్ అనే వ్యక్తి దిడ్గి గ్రామం నుండి మోరేనగర్ కాలనీ వైపు తన బైక్‌పై భార్య, ఇద్దరు పిల్లలతో వెళ్తున్నాడు. కర్ణాటక బస్సు డ్రైవర్ నిర్లక్షంగా, అతివేగంతో, అజాగ్రత్తగా నడిపి వారి బైక్‌ను ఢీకొట్టాడు. దాంతో ప్రశాంత్, అతని భార్య పిల్లలకు బలమైన గాయాలవడంతోపాటు.. కాళ్ళు విరగడం, మెదడుకు గాయాలయ్యాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆ నలుగురు చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు మాట్లాడుతూ.. కర్ణాటక ప్రభుత్వ బస్సులు ఈ మార్గంలో ఇప్పటికీ చాలా ప్రమాదాలకు కారణం అయ్యాయని.. ఆ బస్సు డ్రైవర్లు విపరీతమైన వేగం, నిర్లక్షపూరిత డ్రైవింగ్‌తో జహీరాబాద్ ప్రాంత ప్రజలు అనేకమంది ప్రమాదాలకు గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ అధికారులు తక్షణమే కర్ణాటక ఆర్టీసీ యాజమాన్యంతో మాట్లాడి డ్రైవర్ల నిర్లక్షంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌లకు సన్మానం

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



నారాయణఖేడ్ మున్సిపల్ నూతన చైర్మెన్ ఆనంద్ స్వరూప్ సెట్కర్, వైస్ చైర్మెన్ దారం శంకర్‌లను స్థానిక అంబేద్కర్ భవన్‌లో ప్రజాసంఘాల నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో కమలాపురం మారుతి, భీమ్సేన, నర్సింలు, రాజకుమార్, అంజా గౌడ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఝరాసంగం

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో ఐదో తేదీన నిర్వహించే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షులు విశ్వనాథం అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5వ తేదీన నిర్వహించే బహిరంగ సభకు పార్టీ నాయ కులు, కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి కల్యాణ మహోత్సవంలో కౌన్సిలర్ దంపతులు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం పరిధిలోని బాలాజీనగర్‌లో శుక్రవారం జరిగిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోపాలమ్మ, పెద్దలు పెంటారెడ్డి, అంజయ్య, బాసిరెడ్డి, వెంకట య్య, శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రేజింతల్ గ్రామంలో శుక్రవారం ప్రజల సమక్షంలో 'ధరణి స్పెషల్ డ్రైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టా పాస్‌బుక్‌లో మిస్సింగ్, సర్వే నంబర్లు తప్పులను సవరించుట గురించి ఈ కార్యక్రమంలో చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల భూ సమస్యల పరిష్కారానికిరాష్ట్ర ప్రభుత్వం చక్కటి అవకాశం కల్పించిందని నాయబ్ తహసీల్దార్ రాజిరెడ్డి అన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది కాసిం, గ్రామ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇక నుంచి.. ప్రజా పాలన కేంద్రాలు

- మున్సిపాల్టీలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఏర్పాటు
- ప్రతి కేంద్రంలో ఒక అధికారి, ఆపరేటర్
- కొత్తగా దరఖాస్తుల స్వీకరణ...పాత వాటిల్లో సమాచార మార్పు
- జిల్లా కలెక్టర్లకు మార్గదర్శకాలు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయప్రతినిధి

ఇప్పటి వరకు ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కోసం అధికార యంత్రాంగం ఊరూరూ వచ్చింది. ఆరు గ్యారంటీ పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తుల్ని స్వీకరించారు. ఇక నుంచి వాటిని సరి చేసేందుకు, కొత్తగా దరఖాస్తుల్ని స్వీకరించేందుకు ప్రజా పాలనా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి మండల కేంద్రంలో ఎంపీడీఓ, ప్రతి మున్సిపాల్టీల్లోనూ ప్రజా పాలనా కేంద్రంను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఆరు గ్యారంటీలకు సంబంధించినప పథకాల్ని అందుకునేందుకు వీలుగా నిరంతరం దరఖాస్తుల స్వీకరణ, అభ్యంతరాలు, సమాచారాన్ని సరిచేసుకోవడం, జిరాక్స్‌లు జత చేయడం వంటి పనుల కోసం ప్రత్యేకంగా కౌంటర్లు పనిచేయనున్నాయి.

ప్రజా పాలనా కేంద్రాలు..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలతో పాటు ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతుంటారు. ఇటీవల నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తులు తీసుకున్నారు. అంతటితో ప్రక్రియ ముగిసిపోనందున ప్రత్యేకంగా ప్రజా పాలన కేంద్రాల్ని పెట్టనున్నారు. ప్రతి మండల, మున్సిపల్ కేంద్రాల్లోనూ ప్రజా పాలనా కేంద్రాల్ని పెట్టనున్నారు. ప్రతి కేంద్రంలో ఒక అధికారితో పాటు ఆపరేటర్ ఉంటారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజా పాలనా కేంద్రం పనిచేస్తుంది. ఇటీవల నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల్లో కొంత మేరకు సమాచార లోపముంది. కొందరు ఆయా పథకాల కోసం దరఖాస్తు చేసినప్పటికీ వాటికి సంబంధించిన జీకార్స్‌లను జత చేయలేదు. దరఖాస్తు దారుని కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డులు, రేషన్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, కరెంట్ బిల్లు, బ్యాంక్, గ్యాస్ పుస్తకాలకు సంబంధించిన జీకార్స్ పత్రాలను దరఖాస్తులో జతచేయాల్సి ఉన్నా చాలా మంది వాటిని ఇవ్వలేదు. దీంతో కొన్ని దరఖాస్తులు ఆయా పథకాల కింద లబ్దిపొందేందుకు ఎంపిక చేసే విషయంలో ఇబ్బందులేర్పడ్డాయి. దీంతో మండల, మున్సిపల్ కేంద్రాల్లో ఏర్పాటు చేసే ప్రజా పాలన కేంద్రాల్లో సచారాన్ని సరిచేయడం, జిరాక్స్ పత్రాలను ఇచ్చేందుకు వీలు కల్పుతుంది. అదే విధంగా ప్రజా పాలన కార్యక్రమంలో కొందరు దరఖాస్తు చేసుకోలేదు. అవగాహన లేకపోవడం, స్థానికంగా ఆ రోజుల్లో ఉండని కారణం, దరఖాస్తును ఎలా నింపాలి, అందులో ఏలాంటి సమాచారం ఇవ్వాలి, ఏఏ పత్రాలను జతచేయాలని అనే విషయాల పట్ల అవగహన లేకపోవడంతో చాలా మంది దరఖాస్తు చేయలేదు. అలాంటి వాళ్లందరికీ కొత్తగా పెట్టే ప్రజా పాలన కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునేందుకు వీలుంటది. ఆరు గ్యారంటీ పథకాలతో పాటు ధరణి, ఇతర సమస్యల గురించి కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రజా పాలనా కేంద్రంలో స్వీకరించే దరఖాసుల్ని అందులో ఉండే అధికారి పరిశీలిస్తారు. అర్హతలను బట్టి ఆయా పథకాల కింద ఎంపిక చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తారు. కంప్యూటర్ ఆపరేటర్ గతంలో ఇచ్చిన దరఖాస్తుల్లో ఏమైనా సమాచార లోపం ఉంటే వాటిని సరిచే యడం,జిరాక్స్ పత్రాలను అందులో చేర్చడం వంటివి చేస్తారు.

నిరంతరం పని చేసేలా..

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండల, మున్సిపల్ కేంద్రాల్లోనూ ఏర్పాటు చేసే ప్రజా పాలనా కేంద్రాలు నిరంతరం పనిచేయనున్నాయి. సంగారెడ్డి జిల్లా లో 27 ఎంపీడీఓ కార్యాలయాలు, 8 మున్సిపల్ కార్యా ల యాల్లో ప్రజా పాలనా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. మెదక్ జిల్లాలో నాలుగు మున్సిపల్, 21 ఎంపీడీఓ కార్యాల యాల్లో సిద్దిపేట జిల్లాలో 26 ఎంపీడీఓ, ఐదు మున్సిపల్ కార్యాలయాల్లోనూ ప్రజా పాలన కేంద్రాల్ని ఏర్పాటు చేయ నున్నారు. ఇప్పటికే ఆయా కేంద్రాల్లో ఎవరు ఉండాలనే విష యంలో ఎంపీడీఓలు నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు నివేదించారు.

ప్రజా పాలనా కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ : క్రాంతి వల్లూరి, కలెక్టర్

జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోనూ ఎంపీడీఓ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా పాలనా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నాం. అన్ని కేంద్రాల్లో ప్రజల నుంచి దరఖాస్తుల్ని స్వీకరిస్తారు. గతంలో చేసిన దరఖస్తుల్లో ఏవైన సమాచారం ఇవ్వకపోయినా తప్పు సమాచారం నింపినా వాటిని సరిచేయబడతాయి. అదదే విధంగా ఆయా పథకాల కోసం అవసరమైన పత్రాలను ఇవ్వకపోతే ప్రజా పాలనా కేంద్రాల్లో తీసుకోబడుతుంది.



గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న యువ నాయకులు రోషన్ రెడ్డి

నవతెలంగాణ-కల్హేర్

జెడ్పీటీసీ నరసింహారెడ్డి అల్లుడు మాధవరెడ్డి హైదరాబాద్ కొంపల్లిలో నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ వేడుకలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి తనయులు, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు రోషన్ రెడ్డి హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నరసింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జ్ఞానేశ్వర్ రెడ్డి, సాయి రెడ్డి, విగ్నేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.



వేసవి దృష్ట్యా బోర్లు వేయించాలి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డులో వేసవి దృష్ట్యా బోర్లు వేయించాలని వార్డు కౌన్సిలర్ చంద్రయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ ఏర్పడి నాలుగేండ్లు అవుతున్నా.. ప్రజలు నీళ్ళు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ స్పందించి బోర్లు వేయించాలని లేనిపక్షంలో కార్యాలయంను మహిళలతో కలిసి ముట్టడి చేస్తామని హెచ్చరించారు.



జీరో కరెంటు బిల్లుల జారీ ముమ్మరం

నవతెలంగాణ-ఝరాసంగం

మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 'గృహ జ్యోతి పథకం' కింద జీరో కరెంటు బిల్లుల జారీ ముమ్మరంగా కొనసాగుతోంది. మండలంలోని కక్కర్వాడ గ్రామంలో శుక్రవారం ఉదయం నుంచి విద్యుత్ సిబ్బంది వినియోగ దారులకు రసీదులను అందజేశారు. తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండి నెలకు 200 యూనిట్లు విద్యుత్తు వినియోగించే గృహ విద్యుత్ కనెక్షన్లకు ఫ్రీ కరెంటు వర్తింప చేస్తున్నారు. ఈ పథ కాన్ని గతనెల 27 తేదీన సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. గత నెలలో విద్యుత్ వినియోగానికి సంబంధించిన బిల్లుల స్థానంలో వినియోగదారులకు జీరో బిల్లులు అందజేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు గృహజ్యోతి అమలు చేయడంపై వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సన్నద్ధం కండి

- గీతం ఇండస్ట్రియల్ కాంక్లేవ్-1.0లో వర్ధమాన ఇంజనీర్లకు వక్తల సూచన
- ఉత్తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

నవతెలంగాణ-పటాన్‌చెరు



పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా యువత సన్నద్ధం కావాలని, అందివస్తున్న ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించి ఉత్తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పరిశ్రమకు చెందిన పలువురు ఉన్నతాధికారులు సూచించారు. గీతం కెరీర్ గైడెన్స్ కేంద్రం (జీసీజీసీ) ఆధ్వర్యంలో 'గీతం ఇండస్ట్రియల్ కాంక్లేవ్-1.0'ను శుక్రవారం నిర్వహించారు. ఇందులో పలు పరిశ్రమలు, సాఫ్ట్ వేర్ కంపెనీల ఉన్నతాధికారులు పాల్గొని విద్యార్థుల మెరుగైన భవిష్యత్తు కోసం పలు సూచనలు చేశారు. గీతం విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టు ప్రదర్శనను అతిథులంతా సందర్శించి, అభినం దనలు తెలిపారు. నిమెట్ స్కెచ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ విశాల్ మణి, పరిశ్రమ- విద్యా సంస్థల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేలా గీతం కాంక్లేవు ఏర్పాటు చేయడంపై హర్షం వెలిబుచ్చారు. కెరీర్ రెండు అంశాలపై ఆధారపడి ఉంటుందని, అవి బాహ్య (పరిశ్రమ), సొంత నైపుణ్యాలన్నారు. విజయం మూడు అంశాలపై ఆధారపడి ఉంటుందని అవి నైపుణ్యం, ఎంపిక, కొంచెం అదృష్టంగా అభివర్ణిస్తూ, పరిశ్రమ డిమాండు అనుగుణంగా నైపుణ్యాలను సమకూర్చుకోవాలని వర్ధమాన ఇంజనీర్లకు హితబోధ చేశారు. ఏటీఎంఈసీఎస్ సీనియర్ ఉపాధ్యక్షుడు (ఇంజనీరింగ్) సంజయ్ సింగ్ మాట్లాడుతూ.. 75 నుంచి 78 శాతం వ్యాపారాలు కృత్రిమ మేధ ద్వారా ఉద్యోగులను తగ్గించుకునే ప్రయత్నంలో ఉన్నాయని, 2030 నాటికి మూడు కోట్ల ఉద్యోగాలు పోతాయని హెచ్చరించారు. రాబోయే ఐదేళ్లలో కోడింగ్ ప్రాధాన్యం కూడా తగ్గిపోతుందన్నారు. ఛాట్ జీపీటీలో నైపుణ్యాన్ని సమకూ ర్చుకోవాలని, ఏపీఐ, ఫ్రేమ్ వర్క్ ఎలా పనిచేయాలో నేర్చుకోవాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక మాంద్యం నేపథ్యంలో పట్టభద్రులకు ఉన్నత విద్యాభ్యాసం ఉత్తమమన్నారు. సిగ్నిటీలో టాలెంట్ అక్విజిషన్ సీనియర్ ఉపాధ్యక్షుడు కరుణా వెంపల మాట్లాడుతూ, పరిశ్రమలో రాణించడానికి మంచి భావ ప్రకటనా నైపుణ్యం, సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించుకోవడం అవశ్యమన్నారు. కాలిన్స్ ఏరోస్పేస్ అసోసియేట్ డైరెక్టర్ జెస్పాల్ సింగ్ మాట్లాడుతూ, భారత ప్రభుత్వం తయారీ రంగంపై దృష్టి సారించిందని, మరో రెండు దశాబ్దాలు ఈ ఒరవడి కొనసాగే వీలున్నందున, విద్యార్థులు తమ నైపుణ్యాలను పరిశ్రమల పోకడలకు అనుగుణంగా మార్చుకోవాలని సూచించారు. ఏటీఎంఈసీఎస్ సీనియర్ డైరెక్టర్ (ఇంజనీరింగ్) భాను ప్రకాష్ మాట్లాడుతూ.. కోడింగ్, టెస్టింగ్, కృత్రిమ మేధ వంటి వాటిలో నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. గ్లోబల్ మానవ వనరుల విభాగాధిపతి నరేన్ గుండా బత్తుల మాట్లాడుతూ.. ఇంజనీర్లు బాగా ఆలోచించడం, సమస్యలను పరిష్కరించడం అలవరచుకోవాలని హితబోధ చేశారు.గీతం కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వీ. ఆర్.శాస్త్రి మాట్లాడుతూ, పరిశ్రమ-విద్యా సంస్థల మధ్య స్థిరమైన భాగస్వామ్య ఆవశ్యకతనుచెప్పారు. ఈ రెండింటి వధ్య అంతరం తగ్గాల్సిన ఆవశ్యకత ఉందని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. సీతా రామయ్య అన్నారు. తొలుత, ఈ కార్యక్రమాన్ని కెరీర్ గైడెన్స్ కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ నాతి వేణుకుమార్ ప్రారం భిస్తూ, పరస్పర సహకారాన్ని పెంపొందించడం, సవాళ్లను పరి ష్కరించడం, సమాజాభివృద్ధి కోసం సాంకేతికతను అభి వృ ద్ధి చేయడం లక్ష్యంగా దీనిని నిర్వహిస్తున్నామంటూ అతి థులను స్వాగతించారు. చివరగా, కెరీర్ ఫుల్‌ఫిల్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ లోకేష్ వందన సమర్పణతో కాంక్లేవ్ ముగిసింది.

బీఆర్ఎస్‌తో ఎంపీ బీ.బీ పాటిల్ శకం ముగిసే..

బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి.. బీజేపీలో చేరిన బీబీ పాటిల్

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ రాజకీయ శకం, బీఆర్ఎస్‌తో అనుబంధం ముగిసింది. మొత్తానికి ఎన్నోసార్లు వచ్చిన ఆరోపణలు నిజం చేస్తూ.. శుక్రవారం బీజేపీ పెద్దల సమక్షంలో ఆయన బీజేపీలో చేరాడు. కాగా సౌమ్యుడు, మృదువైన స్వభావి అయిన బీబీ పాటిల్ టీఆర్ఎస్ తరఫున జహీరాబాద్ ఎంపీగా రెండు పర్యాయాలు గెలుపొంది తనకంటూ ఓ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. 2014లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో 40 వేల పైచిలుకు ఓట్లను సంపాదించి చరిత్ర సృష్టించారు. రెండోసారి 2019లో జరిగిన ఎన్నికల్లో కేవలం 6000 ఓట్ల మెజార్టీతో బయట పడ్డారు. నాటి నుంచి బీబీ పాటిల్‌కు బీజేపీతో సంబంధాలు ఉన్నాయని.. ఇప్పటికే పలు దఫాలుగా బీజేపీలో చేరుతున్నట్లు ఎన్నో వార్తలు గుప్పుమన్నాయి. ఇన్నిరోజులు వాటన్ని ంటినీ ఖండిస్తూ వచ్చిన ఆయన.. ఎట్టకేలకు బీజేపీలో చేరా రు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికలు దగ్గర పడడంతో గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్ అధిష్టానంతో దూరంగా ఉండటంతో పాటు సామాన్య కార్యకర్తల, తమ అనుచరుల ఫోన్లు సైతం తీయకపోవడంతో ఈసారి బీబీ పాటిల్ బీజేపీ నుంచి జహీరాబాద్ పార్లమెంటుకు పోటీ చేస్తారని వార్తలు గుప్పుమన్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోవ డంతో ఆ పార్టీకి చెందిన నాయకులు ఇతర పార్టీల వైపు చూస్తున్న తరు ణంలో బీబీ పాటిల్.. బీజేపీ అనుబంధ సంఘాలు, అధిష్టాన నాయకులతో ఉన్న సంబంధాలను మెరుగుపరుచుకొని ఏడాది క్రితం నుంచే ఆ పార్టీ కను సన్నాల్లో నడుచుకొంటూ వస్తు న్నారని సమా చారం. ఇటీవల బీజేపీ సీనియర్ నాయకులు బండి సంజ య్ సైతం బీబీ పాటిల్ తమకు టచ్ లో ఉన్నట్టు ప్రకటించడంతో.. పాటిల్ పార్టీ మారుతున్నారన్న వార్తలకు మరింత బలం చేకూరింది. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన బీజేపీలో చేరారు. కాగా ఈనెల 5న ప్రధాని మోడీ సంగారెడ్డి జిల్లా పర్యటనలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నట్టు విశ్వసనీయ సమాచారం.

220 కిలోల ఎండు గంజాయి పట్టివేత

- ఒకరు అరెస్టు, పరారీలో మరొకరు
- 45 విలువచేసే గంజాయి, బొలెరో కారు స్వాధీనం
- గంజాయి వ్యాపారం మూల సూత్రధారి విశాల్ దిలీప్‌ను త్వరలో పట్టుకుంటాం
- ఉమ్మడి మెదక్ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ హరికిషన్ వెల్లడి

నవతెలంగాణ-పటాన్‌చెరు

ఒరిస్సా నుంచి మహారాష్ట్రకు కారులో అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయి ముఠాను జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీం వలపన్ని పట్టుకున్నారు. పటాన్‌చెరు ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ హరికిషన్ వివరాలను వెల్లడించారు. మహారాష్ట్ర సతార జిల్లాకు చెందిన చంద్రకాంత్ కర్గే మరో వ్యక్తి అమర్ సంజయ్ కావలెలు ఏఓబీ ఒరిస్సా రాష్ట్రం నుంచి మహారాష్ట్రకు బొలెరో కారులో అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తుండగా.. విశ్వసనీయ సమాచారం అందింది. దాంతో జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ గురువారం రాత్రి మండలంలోని ఓఆర్ఆర్ సమీపంలోని ముత్తంగి జాతీయ రహదారి పై కాపుకాసి (ఎంహెచ్12హెచ్ఎన్6656) బొలెరో ఎక్స్‌యూవీ 500 వాహనంను ఆపబోగా తప్పించుకొని వెళ్లింది. ఈ నేపథ్యంలో ఇస్నాపూర్‌లో గల మరో టీం సదరు కారును పట్టుకుని తనిఖీ చేయగా.. అక్రమంగా తరలిస్తున్న రూ.45 లక్షల విలువైన 220 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. దాంతో వాటిని, కారును జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీమ్ స్వాధీనం చేసుకున్నది. చంద్ర కాంత్ కర్గేను అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి అమర్ సంజయ్ కావలె పరారైనట్టు హరికిషన్ తెలిపారు. చంద్రకాంత్ ఖర్గేను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయి వ్యాపారం మూల సూత్రధారైన విశాల్ దిలీప్‌ను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్, ఎస్సైలు రాములు, అనంతరెడ్డి, డీటీఎఫ్ ఎస్ఐ హనుమంతు, సిబ్బంది యాదయ్య, చారి, అఫ్జల్, సత్యనారాయణ డీటీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంస్మరణ దినోత్సవం

నవతెలంగాణ-నంగునూరు



ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు నంగునూరు మండల కేంద్రంలోని బీజేఆర్ చౌరస్తాలో నివాళులు అర్పించారు. నంగునూరు మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షులు ఎనగందుల యాదగిరి, అంబేద్కర్ సంఘం మండల ఉపాధ్యక్షులు దేవులపల్లి రాజమౌళి, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఆరెపల్లి కనకయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కందికట్ల రాజు, మండల నాయకులు దేవులపల్లి శంకర్, దేవులపల్లి భూమయ్య పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

నంగునూరులోని మాదిగ కమ్యూనిటీ హాల్ లో ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇంచార్జి దేవులపల్లి రాజేందర్ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ కులస్తులు, సీనియర్ నాయకులు కలిసి అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు దేవులపల్లి నాగరాజు, కుల పెద్దమనిషి దేవులపల్లి పెద్ద భూమయ్య, సీనియర్ నాయకులు దేవులపల్లి అంకిరెడ్డిపల్లి కనకయ్య దేవులపల్లి బాలరాజ్, మండల అధికార ప్రతినిధి దేవులపల్లి కష్ణ, దేవులపల్లి కనకరాజు, దేవులపల్లి పర్శరాములు, దేవులపల్లి కనకయ్య, దేవులపల్లి రాజశేఖర్, దేవులపల్లి అంజనేయులు, దేవులపల్లి చింటూ, దమ్మగళ్ల బాలరాజు, దేవులపల్లి కర్నాకర్, దేవులపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సమావేశం

నవతెలంగాణ-జిన్నారం



జిన్నారం మండల బీజేపీ శ్రేణుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సంద్భంగా బీజేపీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 5న పటాన్చెరులో ప్రధాన మంత్రి మోడీ బహిరంగ సభను రావాలని కోరారు. ఈ కార్యక్ర మంలో జిల్లాల మండల బీజేపీ అధ్యక్షులు కొత్తకాపు జగన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు రాజు, వెంకటేష్, ఉపాధ్యక్షులు సుధాకర్, రాజు గౌడ్, భవాని శ్రీనివాస్, అగ్రహారం శంకర్ ,వెంకటేష్, ఎల్లేష్ యాద వ్, వెంకటేష్, ప్రసాద్ ,అశోక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

2
నవతెలంగాణ
సంగారెడ్డి
శనివారం | 02 మార్చి 2024 | www.navatelangana.com

మంత్రిపై బండి సంజయ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

మంత్రి పొన్నం ప్రభాకర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు మాజీ ఎంపీ సురేష్ కుమార్ సెట్కార్ తెలిపారు. బండి సంజయ్ అలా మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. రాముడు అందరికీ దేవుడే అని.. బండి సంజయ్ రాముని పేరు మీద రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. తాము హిందు వుల మేనని రాముడు తమకు కూడా దేవుడే అని అన్నారు. ఒక తల్లిని అవమానపరిచే విధంగా మాట్లాడడం సమంజసం కాదన్నారు. రాజకీయాలు వ్యక్తిగతంగా కుటుంబాలపై ఉండకూడదని ప్రజల సమస్యలపై ఉండాలని బండి సంజయ్‌కి సూచనలు ఇచ్చారు. బండి సంజయ్ వ్యక్తిగతంగా దేవుడి పేరుమీద రెచ్చగొట్టే వాక్యాలు చేస్తున్నారని.. అవి మానుకోవాలన్నారు.

రూ.50 లక్షలతో సీసీరోడ్డు, డ్రయినేజీ పనులు ప్రారంభం



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ జోగిపేట మున్సిపాల్టీలోని 14వ వార్డులో ఎస్‌డిఎఫ్ నిధుల కింద రూ.50లక్షల నిధులతో డ్రయినేజీ, సీసీరోడ్డు పనులు చేపడుతున్నట్టు ఆ వార్డు కౌన్సిలర్ పైతర గారి దుర్గేష్ తెలిపారు. డ్రయినేజీ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ఆరోగ్య వైద్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ చొరవతో సీసీరోడ్డు, డ్రయినేజీ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల నుంచి ఎస్సీ కాలనీ వరకు 250 మీటర్ల మేర డ్రయినేజీ పనులు పనులు చేస్తున్నట్టు చెప్పారు. సమస్యల్లేని కాలనీగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవి, కాలనీవాసులు రమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ-సంగారెడ్డి

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా 2024-25 విద్య ఏడాదికి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, బోయినపల్లిలో వాటర్ స్పోర్ట్స్ అకాడమీ కాయాకింగ్, కెనోయింగ్, సెయిలింగ్ మొదలైన వాటర్ స్పోర్ట్స్‌లో గిరిజన బాల బాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, సంగారెడ్డి, యం.ఫిరంగి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో 5వ తరగతితో ప్రవేశం కోసం విద్యార్థిని / విద్యార్థి ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, 30మీ. ఫ్లయింగ్ స్టార్ట్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ 800మీ. పరుగు పందెం పోటీలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా 5వ తరగతిలో ఇంగ్లీష్ మీడియంలో 10 మంది బాలికలకు, 10 మంది బాలురకు ప్రవేశాలు కల్పిస్తారన్నారు. ఈ వాటర్ స్పోర్ట్స్ పాఠశాలలో శిక్షణ పొందే గిరిజన బాల బాలికలకు ప్రత్యేకమైన ఆహారం, వసతి, స్పోర్ట్స్ దుసులు, షూస్ ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన గిరిజన విద్యార్థులు 4వ తరగతి ఉతీర్ణులై ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న బాలబాలికల రెండు (02) పాస్ పోర్టు సైజు ఫోటోలు, బోనఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్ సర్టిఫికెట్లతో ఈనెల నాలుగో తేదీ వరకు సంగారెడ్డిలోని జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో నిర్ణీత నమూనాలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు సంగారెడ్డిలోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిని సంప్రదించాలన్నారు.



కేబీఆర్ కాలనీలో సీసీరోడ్లు పరిశీలించిన మాజీ జెడ్పీటీసీ

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు కేబీఆర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డును జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యతను పాటించాలని అధికారులకి సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బీరప్ప యాదవ్, ఏఈ శ్రీకాంత్, ప్రశాంత్, ఇస్మాయిల్, శ్రీనివాస్, జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సొంతగూటికి ఆనంద్ కృష్ణారెడ్డి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ మాజీ బీజేపీ అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి కొన్ని కారణాల దృష్ట్యా గతంలో బీజేపీని వదిలారు. అయితే తిరిగి బీజేపీలోకి రావాలని రాష్ట్ర నాయకులు, బీజేపీ జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి పిలుపుతో.. శుక్రవారం గోదావరి అంజిరెడ్డి సమక్షంలో ఆనంద్ కృష్ణారెడ్డి తిరిగి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీని చూడాలని.. ఆయన గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.అధిష్టానం ఏ పదవి ఇచ్చినా స్వీకరిస్తూ పార్టీని బలబరుస్తానన్నారు.



పెద్ద గుంతలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

నవతెలంగాణ-కొండాపూర్

అదుపుతప్పిన ఓ ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కనే ఉన్న ఓ పెద్ద గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మాచేపల్లి నుంచి గంగారం వైపుగా ఆర్టీసీ బస్సు వెళ్తున్నది. అయితే మాచపల్లి శివారులో రోడ్డు పక్కనే ఉన్న పెద్ద గుంతలోకి బస్సు దూసుకెళ్లింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఈ రహదారి మొత్తం గుంతలుగా ఉన్నదని.. ఇతర వాహనాలకు దారి ఇచ్చే క్రమంలో చిన్నచిన్న గుంతల కారణంగా ఒక్కసారిగా బస్సు రోడ్డు పక్కనే దూసుకెళ్లి గుంతలో ఆగిందని ఆ బస్సు డ్రైవర్ వివరణ ఇచ్చారు. ప్రమాదాలు జరగకముందే నూతన రోడ్డు నిర్మించాలని స్థానికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇనుప పిల్లర్స్ మీదపడి కార్మికుడు మృతి



నవతెలంగాణ-పటాన్‌చెరు

నూతనంగా నిర్మిస్తున్న ఓ పరిశ్రమ ప్రహరీ గోడ నిర్మాణంలో ఇనుప పిల్లర్స్ మీద పడడంతో ఓ వర్కర్ మృతి చెందాడు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నదియా జిల్లా వెస్ట్ బెంగాల్ రాష్ట్రంకు చెందిన రంజాన్ షేక్ (19) బతుకు దెరువు కోసం ఇక్కడికి వచ్చాడు. మండలంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో నూతనంగా నిర్మిస్తున్న ఓ పరిశ్రమలో లారీలో ఉన్న ఇనుప పిల్లర్లను దించే క్రమంలో.. ఇనుప పిల్లర్లను క్రేన్‌కు పట్టాతో కడుతుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోవడంతో అతని మీద ఇనుప పిల్లర్లు పడి తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు బీడీఎల్ ఎస్సై శివకుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీశైలంకు తరలిన శివ స్వాములు

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో స్థానికంగా శివ స్వాములు ఇరుముడి ధరించి శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనార్థం బయలుదేరారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను శివాలయం కమిటీ చైర్మెన్ అంతిరెడ్డిగారి శ్రీనివాస్ రెడ్డి, శివస్వాముల బృందం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, శివ స్వాములు గురు స్వాములు మ్యాదరి శంకరయ్య, బుక్క శ్రీకాంత్ ,ఫణి భూషణ్, రాజు గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చక్కర పరిశ్రమపై చిగురిస్తున్న ఆశలు

- రైతులకు బకాయి డబ్బుల చెల్లింపు
- తిరిగి గానుగ ఆడించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు
- డైరెక్టర్ ఖిజర్ యాఫై రంగప్రవేశంతో కార్మికుల్లో, రైతుల్లో నూతన ఉత్సాహం
- క్రషింగ్ చేస్తాం, అందరూ సహకరించండి : నూతన డైరెక్టర్



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ మండలంలో ఎంతో ప్రతిష్టగాంచిన ట్రైడెంట్ చక్కెర పరిశ్రమపై రైతులు, కార్మికుల్లో తిరిగి ఆశలు చిగురిస్తున్నాయి. బకాయి డబ్బులు చెల్లించడంలో పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం వహించడంతో పరిశ్రమ వేలం పాటకు ప్రభుత్వం ఆదేశించింది. కానీ చివరీ నిమిషంలో వేలంపాటకు ఒకరోజు ముందు.. బకాయి డబ్బుల్లో రూ.5 కోట్లు చెల్లించడంతో పాటు.. మిగిలిన బకాయిని వచ్చే సోమవారం రోజున చెల్లిస్తామని ఆ పరిశ్రమ నూతన డైరెక్టర్ ఖిజర్ యాఫై హామీ ఇచ్చారు. దానికితోడు వేలంపాటలో పాల్గొనడానికి ఒక్కరు కూడా విముఖత చూపకపోవడం.. బిడ్స్ కూడా వేయకపోవడంతో వేలంపాట కూడా రద్దు అయింది. అయితే సామాజిక ఉద్యమకారుడు ఖిజర్ యాఫై ఈ పరిశ్రమ నూతన డైరెక్టర్‌గా బాధ్యలు స్వీకరించి.. బకాయి డబ్బుల చెల్లింపునకు కృషి చేశాడు. అంతేకాకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ పరిశ్రమలో గానుగ ఆడిస్తామని హామీ ఇవ్వడంతో.. పరిశ్రమపై ప్రజల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

ఈ చక్కర పరిశ్రమను మొదట్లో కేవలం రూ.12 కోట్లకు ఆదికేశనాయుడు కొనుగోలు చేయగా.. ఆయన వద్ద నుంచి తమిళనాడుకు చెందిన ఇతర మేనేజ్మెంట్‌లో రూ.22 కోట్లకు కొనుగోలు చేశారు. వారి వద్ద నుంచి రూ.40కోట్లకు ట్రైడెంట్ యజమాన్యం పరిశ్రమను కొనుగోలు చేసింది. అయితే చెరకను గానగ ఆడిస్తున్నప్పటికీ.. రైతులకు డబ్బులు ఇవ్వడంతో యాజమాన్యం నిర్లక్ష్యం చేసింది. దాంతో నాటి నుంచి పరిశ్రమ ఒకడుగు ముందుకు.. మూడు అడుగులు వెనుకకు అన్న చందాగా తయారైంది. బకాయిలు చెల్లింపులో తీవ్ర జాప్యం జరగడంతో.. చివరికి అధికారులు పరిశ్రమలో ఆర్‌ఆర్ యాక్టును వినియోగించి వేలం వేయాలన్న నిర్ణయం జరిగింది. దాంతో ఇక పరిశ్రమ శకం ముగిసిందని అందరూ భావించారు. కానీ పరిశ్రమలో మరో డైరెక్టర్‌గా జహీరాబాద్ ప్రాంతానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు, మహమ్మద్ ఖిజర్ యాఫై దశలవారీగా రైతులకు బకాయపడి ఉన్న డబ్బులను చెల్లిస్తూ వచ్చారు. కానీ పరిశ్రమపాత యజమాన్యానికి నూతన డైరెక్టర్లకు పొసగకపోవడంతో రైతులకు చెల్లించాల్సిన డబ్బులను చెల్లించ కుండా నిలిపివేశారు. దాంతో పరిశ్రమ వేలంపాట దశకు చేరుకుంది. కానీ చివరి క్షణంలో కలెక్టర్ సమక్షంలో రూ.5కోట్ల బకాయి డబ్బులను చెల్లించడంతో పరిశ్రమపై తిరిగి అందరికి ఆశలు చిగురించాయి. పరిశ్రమలో కొత్త మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో క్రషింగ్ కొనసాగుతుందన్న ఆశలు మొదలయ్యాయి.

అంతేకాకుండా ఇటీవలే పరిశ్రమ కార్మికులు నూతన డైరెక్టర్ యాఫైతో సమావేశమై.. పరిశ్రమలో గానుగా ఆడించేందుకు సిద్ధంగా ఉండండి తాము అన్ని విధాల సహకరిస్తామని విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. గతంలో రెండు నెలలకు సంబంధించిన జీతాన్ని మాత్రమే చెల్లించారని.. తమకు ఇంకా 5 నెలల జీతం పెండింగ్‌లో ఉన్నదని యాఫై దృష్టికి కార్మికులు తీసుకువచ్చినట్టు తెలిసింది. అయితే పరిశ్రమలో చిన్న చిన్న మరమ్మతులు చేపడితే గానగ ఆడించేందుకు పరిశ్రమ సిద్ధంగా ఉన్నదని.. తాము కూడా సహకరిస్తామని కార్మికులు రాములు, యూసుఫ్‌లు తెలిపారు.

రైతుల క్షేమం కోసమే పరిశ్రమలో అడుగుపెట్టాను

నేను కూడా చెరకు రైతు కుటుంబం నుంచి వచ్చిన వాడినే. ఈ పరిశ్రమకు ఎంతో చరిత్ర ఉందో నాకు కూడా తెలుసు. పరిశ్రమలో గానుగడాడించి రైతులను ఆదుకోవాలనుకున్నా.. గతంలో ఉన్న యజమాన్యం సహకరించక పోవడంతో డబ్బుల చెల్లింపు లో జాప్యం జరిగింది. ప్రభుత్వం, పాత యజమాన్యం సహకరిస్తే ఈయేడు చెరకు క్రషింగ్ చేసేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తా.

– ఖిజర్ యాఫై, డైరెక్టర్



ప్రారంభమైన గృహజ్యోతి పథకం

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని మంజీరానగర్‌లోని సీనియర్ జర్నలిస్టు సాయినాథ్ ఇంటినుంచి గృహజ్యోతి పథకాన్ని విద్యుత్ శాఖ సంగారెడ్డి డీఈ సురేందర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయినాథ్ దంపతులకు '0' బిల్లును అందించారు. ఈ సందర్భంగా డీఈ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ నెల 200 యూనిట్ల వరకు ఉచితంగా అర్హులైన ప్రతి కుటుంబానికి విద్యుత్ సబ్సిడీ ఇస్తున్నట్టు విద్యుత్ శాఖ తెలిపిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.



న్యాల్‌కల్ : న్యాల్‌కల్ మండలంలో గృహజ్యోతి కింద 200 యూనిట్‌లలోపు ఉచిత విద్యుత్‌ను శుక్రవారం నుంచి అమలు పరిచినట్టు ఏఈ అర్జున్ తెలిపారు. క్షేత్రస్థాయిలో వినియోగదారుల ఇంటికెళ్లి ఈ పథకాన్ని ప్రారంభించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది జైపాల్, విద్యుత్ వినియోగదారులు ఉన్నారు.

ప్రధానమంత్రి బహిరంగ సభాస్థలి పరిశీలన



నవతెలంగాణ-పటాన్‌చెరు

రాష్ట్రంలో పలు అభివృద్ధి ప్రారంభోత్సవాల్లో భాగంగా ఈనెల ఐదున ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పటాన్‌చెరు పారిశ్రామిక వాడకు వస్తున్నారు. పటాన్‌చెరు శివారులో గల ఎస్సార్ అంజిరెడ్డి క్రీడా ప్రాంగణంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. కాగా ఈ సభాస్థలి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, ఎస్పీ రూపేష్, బీజేపీ మెదక్ పార్ల మెంట్ ఇంచార్జీ బసవలక్ష్మీ నర్సింహా, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డిలతో కలిసి శుక్రవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా బీజేపీ మెదక్ పార్లమెంటు ఇంచార్జీ బసవ లక్ష్మీ నర్సింహా, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మోడీ సభా ఏర్పాట్లపై మాట్లాడారు. పలు అభివద్ధి పనులను ప్రజలకు అంకితం చేసేందుకు ప్రధానమంత్రి మోడీ పటాన్‌చెరుకు వస్తున్నారన్నారు. కంది, రాంసాన్ పల్లి, మిర్యాల గూడ, కోదాడ, మహబూబ్‌నగర్, జడ్చర్ల వరకు రూ.2114 కోట్లతో నిర్మించిన నేషనల్ హైవే, తదితర అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేసేందుకు వస్తున్నారన్నారు. నేడు అన్ని పార్టీ లు ఎన్డీయే వైపు చూస్తున్నాయన్నారు. త్వర లో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అన్ని పార్ల మెంటు స్థానాలుగెలుస్తామని భీమా వ్యక్తం చేశా రు. మోదీ బహిరంగ సభకు జహీరాబాద్, మెదక్ పార్ల మెంట్ నుంచి లక్షమందికి పైగా ఈ సభకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తునామన్నారు. కార్యక్రమంలో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేడియాలజీ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో రేడియాలజీ సెంటర్‌ను ఎమ్మెల్యే సంజీవరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారలతో నారాయణఖేడ్ ఏరియా ఆసుపత్రిని అభివృద్ధి పరుస్తున్నామన్నారు. అంతేకాకుండా అన్ని రకాల సేవలను రోగులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆస్పత్రిలో ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఆసుపత్రిలో నూతన భవనాల కోసం కోసం ప్రపోజల్ కూడా పెట్టినట్టు చెప్పారు. నియోజకవర్గంలో పీహెచ్‌సీలను అప్గ్రేడ్ చేసామని, మరిన్ని హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేస్తామ న్నారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ చైర్మెన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మెన్ దారం శంకర్ గుప్తా, మున్సిపల్ కౌన్సిలర్లు వివేకాన ంద, హను మాన్లు,సద్దాం, మాజీ రామకృష్ణ, ఖేడ్ ఏరియా హాస్పిటల్ సూపర్డెంట్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో విద్యార్థుల మాక్ పోలింగ్









నవతెలంగాణ-జోగిపేట, నారాయణఖేడ్‌రూరల్

ఎలక్షన్ కమీషన్, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశానుసారం అందోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఎన్నికల నమూనా(మాక్ పోలింగ్)ను శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. 6వ తరగతి నుంచి 10 తరగతి విద్యార్థులు ఈ మాక్‌పోలింగ్‌లో పాల్గొన్నారు. విద్యార్థులు ఎన్నికల్లో పోటీదారులుగా, ఎన్నికల సిబ్బందిగా, పోలీసులుగా, పోలింగ్ ఏజెంట్లుగా విధులు నిర్వహించారు. ఓటరుగా ఆధార్ కార్డు చూపించి ఓటు హక్కు వినియోగించుకున్నారు. విద్యార్థు లకు ఎన్నికల విధానంపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.దేవిదాస్ తెలిపారు. మాక్ పోలింగ్ నిర్వహణ గురించి విద్యార్థులకు పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు యస్. విబి గీతాకుమారి వివరించి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆకుల మాణయ్య, కే. రమేష్, అబ్దుల్ అజీమ్, సరిత, కొండల్, నవీన, వి.బి శ్రీనివాస్, వి.సాయిలు, శ్రీదేవి పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌రూరల్ : మండలంలోని మన్సూర్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. నలుగురు విద్యార్థులు పోటీలో నిలబడగా.. వారికి గుర్తులు కేటాయించి, బ్యాలెట్ ఆధారంగా పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులే పోలింగ్ సిబ్బందిగా వ్యవహరించారు. విద్యార్థులందరూ ఉత్సాహంగా తమ ఓటు హక్కును ఉత్సాహంగా వినియోగించుకుని పోలింగ్ పై అవ గాహన పొందారు.ఈ కార్యక్రమాన్ని ప్రధానో పాధ్యాయులు మడుపతి నరేష్, ఉపాధ్యాయులు సైమన్, యాదగిరిల పర్యవేక్షణలో నిర్వహించారు. మనూరు మండ లం ఎన్జీ ఉక్రాంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో ప్రాథమిక పాఠశాల ఎన్జీ ఉక్రానా విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు.

జిన్నారం : మండల పరిధిలోని గడ్డపోతారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులు మాక్‌పోలింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో అభ్యర్థులు పోటీ చేయడం, ఓటర్లు ఓట్లు వేయడం, తదితర అంశాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. అలాగే ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు గల విద్యార్థులు తమ ఆధార్‌కార్డులతో విద్యార్థుల్లో పోటీదారులైన అభ్యర్థులకు మాక్ పోలింగ్ సందర్భంగా నమూనా ఓట్లు వేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కుమార స్వామి, ఉపాధ్యాయులు శేఖర్‌బృందం పాల్గొన్నారు.

న్యాల్‌కల్ : మండలంలోని హద్నూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్, ఫలితాలు, ఓటు వేసే విధానం పిఓ, ఓపిఎస్, ఎన్నికల అధికారులు చేసే విధానాలపై విద్యార్థులకు అధికారులు అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మారుతి రాథోడ్, ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని మీర్ఖాన్‌పేట గ్రామంలో నూతనంగా నిర్మించే సీసీరోడ్డు మరియు నిజాంపేట మండలంలోని బాచేపల్లి గ్రామాల్లో పంచాయతీ సీసీరోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి శుక్రవారం శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అన్నారు. గ్రామాల్లో అంతర్గతంగా మెరుగైన రహదారులు నిర్మించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తున్నదన్నారు. మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి వాగ్దానాన్ని తప్పకుండా అమలు చేసి తీరుతామన్నారు. అందులో భాగంగానే గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ మరియు రూ.500కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌ను ఇటీవలే ప్రారంభించిందన్నారు. అనంతరం బాచేపల్లి పీఏసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రైతు సేవ కేంద్రాన్ని ప్రారంభించారు. తర్వాత నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి గ్రామ మహాత్మ జ్యోతిరావు పూలే స్కూల్ హాస్టల్‌ను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు తీరును పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మెనూ బోర్డును, వంటశాలను, మరుగుదొడ్లను, వాటర్ ట్యాంకులను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి నాణ్యమైన భోజనంతో పాటు విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ సంగారెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేశం, పార్టీ అధ్యక్షులు శంకర్ గౌడ్ బూరుగుల పోచయ్య, నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ ,ప్రవీణ్ గౌడ్, దేవదాస్, మంగలి హను మాన్లు, మాణిక్యం, బేగరి జైలు, ఆనందం, ఈడిగి రాజు గౌడ్, సీమోను, బాబా పటేల్, హనుమాన్లు పటేల్, రవి, రాధా కిషన్, కోరుడు శ్రీను,సాయిబాబా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-జహీరాబాద్

రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విధులు బహిష్కరించి.. సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు మున్సిపాల్టీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సంద ర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ మాట్లాడుతూ.. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని.. దాంతో వారి కుటుంబ పోషణ భారంగా మారుతున్నదన్నారు. మున్సిపల్‌లో పనిచేస్తున్న పారిశుధ్య వాటర్ సప్లంఖ, ఇంజినీరింగ్ ఎలక్ట్రికల్ కార్మికులు నెలజీతం పైనే ఆధారపడ్డ వారికి రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే వారి జీవనం ఎలా గడుస్తుందని మండిపడ్డారు. ట్యాక్స్ వసూలు అయితే తప్ప జీతాలు ఇవ్వలేమని అధికారులు చెప్పడం సరికాదన్నారు. అందుకే కాంట్రాక్ట్ కార్మికులందరికీ ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్(సీఐటీయూ) నాయకులు కామయ్యా, యశోదమ్మ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..





నవతెలంగాణ-కల్హేర్

మండల కేంద్రమైన సిర్గాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా నిశాంత్, డీఈఓగా దీపక్, ఎంఈఓగా వికాస్, ప్రధానోపాధ్యాయులుగా వైశాలి, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా, పీఈటీలుగా, అటెండర్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా స్కూల్ హెడ్మాస్టర్ శాంతిబాయి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో సంతోషం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన విషయాలన్నింటినీ పాటిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మెన్ నర్సింలు, స్కూల్ ఉపాధ్యాయులు విష్ణు, తదితర ఉపాధ్యాయులు, వైస్ చైర్మెన్ స్కూల్ అటెండర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్ : మండలంలోని మిర్జాపూర్(బి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. డీఈఓగా ముస్తఫా, ఎంఈఓగా చరణ్, హెచ్‌ఎంగా నికిత, పాఠశాల హెచ్‌ఎంగా విజయ కుమారి, హరినిత వ్యవహరించారు.

నర్సరీల నిర్వహణపై నిఘా పెంచండి



నవతెలంగాణ-ఝరాసంగం

రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రతీ గ్రామంలో ఏర్పాటుచేసిన నర్సరీల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు నిఘా పెంచాలని, నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం మొక్కలను పెంచాలని ఎంపీడీవో సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని ఏడాకులపల్లి, జూనేగావ్, గ్రామంలో శుక్రవారం నర్సరీల నిర్వహణ, ఉపాధి హామీ కూలీల పనితీరును పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ఉపాధి హామీ పనులు కూలీలు సరైన సమయంలో పనులకు చేరుకోవాలని, టీఏలు సూచించిన కొలతల మేరకు పనులు చేపట్టాలన్నారు. నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట ఏపీవో రాజ్ కుమార్, టిఏ శ్యామయ్య తదితరులు ఉన్నారు.

తండ్రి తలపై కొట్టడంతో మృతి



నవతెలంగాణ-మనోహరాబాద్

ఫ్యాన్ వేయడంలో ఇద్దరి మధ్య జరిగిన గొడవలో తండ్రి తలపై కొడుకు కొట్టడంతో తండ్రి మృతి చెందిన ఘటన మండలంలోని కూచారంలో గురువారం జరిగింది. వివరాల ప్రకారం మండలంలోని కూచారం గ్రామానికి చెంద్రయ్య (48)కు కొడుకు ప్రశాంత్ ఉన్నాడు. కాగా ప్రశాంత్ తాగుడుకు బానిసై జులాయిగా తిరుగుతూ ప్రతి రోజు తాగివచ్చి తండ్రితో గొడవపడుతూ కొట్టేవాడని తెలిపారు. కాగా గురువారం ఇంటికి రాగా తండ్రి చంద్రయ్య పడుకున్నాడు. దాంతో ఫ్యాన్ వేయడంలో ఇద్దరి మధ్య గొడవ జరిగినట్టు తెలిపారు. దాంతో కొడుకు ప్రశాంత్ తండ్రి చంద్రయ్య తలపై గొడ్డలి కామతో కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చంద్రయ్యను తూప్రాన్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. దాంతో కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లగా రాత్రి 11 గంటల ప్రాంతంలో మృతి చెందినట్టు తెలిపారు. దాంతో తల్లి బొంతపల్లి నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తూప్రాన్ సీఐ కృష్ణ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుని ఆత్మహత్య



నవతెలంగాణ-నార్సింగి

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నార్సింగి పట్టణ కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జరిగింది. నార్సింగి ఎస్సై అహ్మద్ మోహిఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం నార్సింగి ఎస్సీ కాలనీకి చెందిన చీగులపల్లి సురేష్ (39)కు భార్య మౌనిక, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సురేష్ కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులకు తోడు అప్పుల బాధ భరించలేక, కుటుంబ పోషణ భారమై జీవితంపై విరక్తి చెంది అతని ఇంటిలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అహ్మద్ తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల అవినీతి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్



నవతెలంగాణ-నర్సాపూర్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల అవినీతికి పాల్పడిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆరోపించారు. నర్సాపూర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం, మేడిగడ్డ, ధరనీల పేరుతో ప్రజాధనాన్ని వృధా చేయడమే కాకుండా పేద ప్రజల భూములను అన్యాయంగా గుంజుకున్నారన్నారు. ప్రాజెక్టులకు కనీసం పరమత్తులు కూడా చేయలేదని, అవినీతికి పాల్పడ్డ వెయ్యి కోట్లతో బీఆర్ఎస్ నాయకులు సొంతగా విమానం కొనుగోలు చేశారన్నారు. పథకాల అభివృద్ధి పేరుతో రైతులను, విద్యావ్యవస్థను, వైద్య వ్యవస్థను మోసం చేసిందన్నారు. అధికారంలో ఉన్న సమయంలో ఒక్కరోజు కూడా మేడిగడ్డను సందర్శించని వారు అధికారం కోల్పోయిన తర్వాత మేడిగడ్డను సందర్శించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కమిషన్ల కొరకు ప్రాజెక్టులను నాసిరకంగా నిర్మించారని ఆయన ఆరోపించారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు.

చింత చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి




నవతెలంగాణ-నార్సింగి

చింత చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధి గ్రామమైన శేరిపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బండారు మల్లేష్ యాదవ్ (40) చెట్టు పైకి ఎక్కి చింత కాయలు కొడుతూ ప్రమాదవశాత్తు కాలు జారీ కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. అది గమనించిన బంధువులు వెంటనే స్పందించి మల్లేష్ యాదవ్‌ను నార్సింగిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తేల్చారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని రామాయంపేట ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

గృహజ్యోతి పథకంలో అర్హులకు అవగాహన కల్పించాలి

- తూప్రాన్ డీఈ రాజెందర్



నవతెలంగాణ-మనోహరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన గృహ జ్యోతి పథకంలో అర్హులైన వారికి జీరో బిల్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తూప్రాన్ విద్యుత్ శాఖ డీఈ రాజెందర్ విద్యుత్ అధికారులకు సూచనలు చేశారు. శుక్రవారం తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని పోతరాజ్‌పల్లిలోగల విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి పథకంలో అర్హులకు జీరో బిల్ ఎలా అందజేయాలో, అలాగే అర్హులై ఉండి పథకం రాని వారు ఏంచేయాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రస్తుతం జీరో బిల్ రాని వారు గ్రామపంచాయితీ అయితే స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో, మున్సిపల్ పరిధి వినియోగదారులైతే మున్సిపల్ కార్యాలయంలో వారి విద్యుత్ బిల్లు, రేషన్ కార్డు, ఆదార్ కార్డు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకుని రశీదును స్థానిక విద్యుత్ శాఖ ఏఈకి అందజేసి సరిచేసిన బిల్లును పొందాలని సూచించారు. ఈ మేరకు తూప్రాన్ ఏడీఈ రాజమల్లేషం, ఏఈలు వరహాలబాబు, కృష్ణ తదితరులు గ్రామంలో వీదులలో తిరుగుతూ అర్హులైన వినియోగదారులకు జీరో బిల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు దుర్గాప్రసాద్, వెంకటేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

నవతెలంగాణ-మనోహరాబాద్

స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాది పథకం ద్వార సంగారెడ్డిలోని శిక్షణా కేంద్రంలో గ్రామీణ మహిళలకు నెల రోజుల పాటు ఉచితంగా ఉమెన్స్ టైలరింగ్‌లో శిక్షణ కార్యక్రమం ఈ నెల 4 నుంచి ప్రారంభిస్తున్నట్టు మనోహరాబాద్ ఏపీఎం పెంటాగౌడ్ సూచించారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలలోపు వయసు గల మహిళలు అర్హులని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, ఉచిత వసతి ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం ఉచితంగా టైలరింగ్ కిట్‌ను అందజేయనున్నట్టు ఎస్‌బిఆర్ఎస్ఈటిఐ డైరెక్టర్ వంగ ప్రసాద్ తెలియజేశారన్నారు. ఆసక్తి గల మహిళలు ఆదార్ కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, 10 క్లాస్ మెమో జిరాక్స్, నాలుగు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను వెంట తీసుకుని రావాలని ఆయన సూచించారు. ఆసక్తిగల వారు పూర్తి వివరాల కోసం 9490103390, 9490129839 నంబర్‌లకు సంప్రదించాలని, దరఖాస్తుకు ఈ నెల 2వ తేదీ ఆఖరు అని తెలిపారు. ఆసక్తిగల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎం పెంటాగౌడ్ సూచించారు.

యుగాండాలో మృతి చెందిన కరుణాకర్‌కు స్వగ్రామంలో అంత్యక్రియలు



నవతెలంగాణ-నార్సింగి

నార్సింగి పట్టణ కేంద్ర నివాసి తమ్మారెడ్డిగారి లక్ష్మారెడ్డి కొడుకు తమ్మారెడ్డి కరుణాకర్ రెడ్డి దాదాపు రెండు సంవత్సరాల క్రితం ఉపాధి కోసం సౌత్ ఆఫ్రికాలోని యుగాండాకు చెందిన సూడాన్ ఎక్స్పోర్ట్ కంపెనీలో పని చేయడానికి వెళ్ళాడు. అయితే ఫిబ్రవరి 26న కరుణాకర్ రెడ్డి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు అక్కడి కరుణాకర్ మిత్రులు మృతుని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృత దేహాన్ని స్వస్థలం రప్పించడానికి తెలంగాణ వలస కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.సాయెందర్‌ను సంప్రదించగా ఆయన యుగాండా నుంచి మృత దేహాన్ని తెప్పించారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి స్వగ్రామం వరకు ప్రభుత్వం తరపున ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేశారు. వలస వెళ్లి చనిపోయిన వారి అంత్యక్రియలకు, కుటుంబ సభ్యులను ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని సాయేందర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. మృతునికి భార్య లావణ్య, కొడుకు భాను ప్రసాద్ రెడ్డి(10), కూతురు భాను ప్రియ (12) లు ఉన్నారు. శుక్రవారం మృతుని స్వగ్రామమైన నార్సింగిలో మృతదేహానికి బంధువుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు.

గ్రామపంచాయితీ సిబ్బంది పెండింగ్ జీతాలు చెల్లించాలి

- మార్చి 5 వరకు ఇవ్వకుంటే పనులు ఆపేస్తాం
- సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ
- అదనపు కలెక్టర్ రమేష్ సీఐటీయూ వినతి పత్రం

నవతెలంగాణ-మెదక్

గ్రామపంచాయతీ సిబ్బంది పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కోశాధికారి, గ్రామ పంచాయితీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కడారి నర్సమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రమేష్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ గ్రామ పంచాయితీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం గత 4 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. జీతాలు రాకపోవడంతో సిబ్బంది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటవ తేదీన జీతాలు చెల్లించే రాష్ట్ర ప్రభుత్వానికి గ్రామాలలో సేవలందిస్తున్న పంచాయతీ సిబ్బందికి మాత్రం వేతనాలు ఇచ్చేందుకు ప్రభుత్వం దగ్గర బడ్జెట్ లేదా అని మండిపడ్డారు. మార్చి 5వ తేదీ వరకు పెండింగ్ జీతాలను చెల్లించాలని, లేనిపక్షంలో 6వ తేదీ నుంచి జిల్లాలో పారిశుద్ధ్య పనులు ఆపేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏడుపాయల జాతర డ్యూటీలు సైతం చేయమని స్పష్టం చేశారు. అలాగే కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రతినెల కార్మికులకు సబ్బులు, నూనెలు అందించాలని గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పలు చోట్ల సిబ్బందిపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజనానికి గంట సమయం కూడా ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, పద్మారావు, సిద్ధిరాములు, సత్యం, ఎల్లం, సామేల్, లింగం, రాజు, సాయిలు, నర్సింలు, స్వామి తదితరులున్నారు.



భూ సమస్యలను పరిష్కరించాలి

- ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలి
- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-మెదక్

భూ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో పట్టా భూమి కొలతల కోసం చేసుకున్న దరఖాస్తుల విషయం, ఫారెస్ట్, రెవెన్యూ బౌండరీస్, ప్రభుత్వ భూములను గుర్తించడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టా భూమి కొలతల కోసం దరఖాస్తు చేసుకున్న భూ సంబంధిత ఫిర్యాదులను పరిశీలించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో 259 ఎఫ్ లైన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా 49 దరఖాస్తులు మాత్రమే పరిష్కరించడం జరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న పట్టా భూమి కొలతల దరఖాస్తులను సాధ్యమైనంత తొందరలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూముల గుర్తింపు వేగం పెంచాలని సర్వేలో ఏదైనా సమస్య నెలకొని రిజెక్ట్ చేసిన పక్షంలో దీనికి సంబంధించిన సమాచారం క్లియర్‌గా తమ దగ్గర ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురైతే ఉపేక్షించేది లేదని సర్వేయర్‌లను హెచ్చరించారు. సర్వే చేసేటప్పుడు బౌండరీస్ పక్కాగా నమోదు చేయాలని వీటితో పాటు రెవెన్యూ స్కెచ్ గూగుల్ మ్యాప్ తప్పనిసరని తెలిపారు. అసైన్డ్ భూముల్లో పెద్ద పెద్ద భవనాలు నిర్మాణం జరుగుతున్నాయని, వాటిపై దృష్టి సారించాలన్నారు. ఫారెస్ట్ బౌండరీ డిస్ట్రిబ్యూట్స్‌పై ఫారెస్ట్ ల్యాండ్ సర్వే సమన్వయంగా వ్యవహరించాలన్నారు. సర్వేయర్లు సర్వే చేసేటప్పుడు మార్కింగ్ గుర్తించాలని ఆ భూమి నేషనల్ హైవే, ఆర్ అండ్ బి రోడ్డుకు ఎంత దూరంలో ఉందనేది గూగుల్ మ్యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు సర్వే యాక్ట్ అమలు చేయాలన్నారు. డాష్ బోర్డ్ చెకింగ్ ప్రకారం ఏ సర్వేయర్ దగ్గర ఎన్ని దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి అనేది పరిశీలన చేసుకోవాలని డిప్యూటీ ఇన్స్పెక్టర్ శివకుమార్‌ను ఆదేశించారు. వచ్చే సమావేశంలో ఈ సమస్యలపై పురోగతి కనిపించాలని లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సర్వే ల్యాండ్ ఏడి శ్రీనివాస్, డిప్యూటీ ఇన్స్పెక్టర్లు శివకుమార్, శేఖర్ వర్మ, సుజాత, ఫారెస్ట్ సూపరింటెండెంట్ సంబంధిత మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-కౌడిపల్లి

ధరణిలో ఉన్న పెండింగ్ సమస్యలన్నీ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ధరణిలో ఉన్న పెండింగ్ సమస్యల రికార్డులను పరిశీలించారు. ఫోటో మార్పు కోసం గత ఐదు నెలల క్రితం దరఖాస్తు చేసుకోగా, ఇప్పటివరకు అది మార్చకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు మార్చి 1 నుంచి 9 వరకు ధరణిలో ఉన్న సమస్యలన్నీ పూర్తి చేయాలన్నారు. మండలంలో మూడు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. తహశీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసిల్దార్ తారాబాయి, ఆర్ఐ శ్రీహరి, మూడు బృందాలుగా ఏర్పడి అవసరమైతే గ్రామాల్లోకి వెళ్లి సమస్యలను పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఫోటో మార్పు ఆధార్‌లో తప్పులు ఖాతా నెంబర్, సర్వేనెంబర్, పేరు తప్పు పడితే మీ సేవలో దరఖాస్తు చేసుకున్న ఏడు రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలని తెలిపారు. మీ సేవలో దరఖాస్తు చేసుకున్న తహశీల్దార్ పరిధిలో ఉన్న సమస్యలు ఏడు రోజుల్లోగా, ఆర్డీవో మూడు రోజుల్లో, జిల్లా కలెక్టర్ మూడు రోజులలో పరిష్కరించాలని తెలిపారు. జిల్లాలో ధరణి పెండింగ్ దరఖాస్తులు 6538 ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పెండింగ్ స్పెషల్ డ్రైవ్‌లో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహశీల్దార్ తారాబాయి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన స్టాఫ్ నర్స్‌లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్
- సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్, జిల్లా వైద్యాధికారిని కలిసిన స్టాఫ్ నర్స్‌లు




నవతెలంగాణ-సిద్దిపేట, సిద్దిపేట కలెక్టరేట్

సిద్దిపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో తొలగించిన వందమంది స్టాఫ్ నర్సులను ఎన్.హెచ్.ఎంలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ముందు సీఐటియూ ఆధ్వర్యంలో స్టాఫ్‌నర్స్‌లు ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సమస్యలపై పరిశీలించి న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఫిబ్రవరి 19 నుండి విధుల్లో నుండి తొలగించిన వందమంది స్టాఫ్ నర్సులను విధుల్లోకి తీసుకోవాలని పలుమార్లు అప్పటి కలెక్టర్ కానీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాష్ట్రంలో సంబంధిత డిఎం ఈ కి, ఆరోగ్యశాఖ కార్యదర్శి కి, ప్రిన్సిపల్ సెక్రెటరీ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ల ను కలిసిన సందర్భంగా స్థానిక డి ఎం డిహెచ్ఓ కి ఫోన్లో మాట్లాడి వందమంది స్టాఫ్ నర్స్ వెంటనే ఎన్ హెచ్ఎం లో వీధిలోకి తీసుకోవాలని ఆదేశించారని, కానీ జిల్లా వైద్యాధికారి కాశీనాథ్ ని కలిస్తే ప్రభుత్వం నుండి, ప్రిన్సిపల్ సెక్రెటేరియట్ నుండి నాకు ఎలాంటి ఆర్డర్ రాలేదని, స్టాఫ్ నర్స్ లను విధుల్లోకి తీసుకోలేదని తెలిపారు. అత్యంత ప్రమాదకరమైన కరోనా కాలంలో ప్రజలకు సేవలు అందించిన స్టాఫ్ నర్స్ లను తొలగించడం సరికాదని, ఇలాంటి పరిస్థితుల్లో వారిని రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాల్సింది పోయి తొలగించడం సరికాదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్టాఫ్‌నర్స్‌లకు న్యాయం చేయాలని, ఎన్‌హెచ్ఎంలో వందమందికి అవకాశం కల్పించి, వంద కుటుంబాలు రోడ్డు మీద పడకుండా ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాడికొండ రవి, స్టాఫ్‌నర్సులు సంపత్, తార, గీత, బాల్‌లక్ష్మి, అనిత, సౌందర్య అరుణ, లావణ్య, రాజ్ కుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్ గ్రూప్‌లో వీడియో పెట్టినందుకు దాడి




నవతెలంగాణ-నార్సింగి

నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో మీ సేవ ఆపరేటర్‌పై ఓ వ్యక్తి దాడి చేయగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మైలారం భూపతి (35) మీసేవ ఆపరేటర్‌కు వాట్సప్‌లో శంకరంపేట్‌లో నకిలీ విత్తనాలు కొని రైతు మోసపోయాడని యుట్యూబ్ వార్త లింక్ వచ్చింది. భూపతి ఆ లింకును ఛత్రపతి వాట్సప్ గ్రూప్‌లో పెట్టాడు. అది గమనించిన ఎరువుల దుకాణదారుడు నార్సింగి నివాసి శిర్న వెంకటేష్ (36) ఫిబ్రవరి 29 న రాత్రి 9:25 గం.లకు మీసేవ వద్దకు చేరుకున్నాడు. భూపతి తాను పనిచేసే మీసేవ ముందు నిలబడి నార్సింగి పట్టణానికి చెందిన మైలారం బాబు, రోమాల రాజులతో మాట్లాడుతూ ఉండగా వెంకటేష్ అక్కడికి చేరుకుని, ఛత్రపతి వాట్సప్ గ్రూప్‌లో తన ఫెర్టిలైజర్ దుకాణానికి సంబంధించిన వీడియోను ఎందుకు పెట్టావని బూతులు తిడుతూ కట్టెతో భూపతి తలపై కొట్టాడు. దీంతో భూపతి తలకు తీవ్ర గాయమై రక్తస్రావమైంది. అకారణంగా తనను బూతు మాటలు తిట్టి, కట్టెతో కొట్టి గాయపర్చిన వెంకటేష్ పై చర్యలు తీసుకోవాలని భూపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎఫ్ఐఆర్ దాఖలు చేసి కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

నిరుపేదలకు అండగా నిలుస్తా

- ఎల్ఓసి చెక్కును అందించిన నర్సాపూర్ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి



నవతెలంగాణ-చిలిపిచేడ్

మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన గొల్ల రాములు తండ్రి సాయిలుకు గత నెల 20వ తేదీన తునికి రైతు వేదిక దగ్గర జరిగిన ప్రమాదంలో కాలు విరిగి, తలకు గాయమైంది. నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న అతనికి నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.75 వేల చెక్కును అంతారం సర్పంచ్ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో అందజేశారు. అనంతరం రాజిరెడ్డి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమన్నారు. నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి బస్సు సౌకర్యం కల్పించాలి

- మంత్రిని కోరిన శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ఆర్టీసి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి కోరారు. శుక్రవారం సెక్రటేరియట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శ్రీనివాస్ రెడ్డి కలిసి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దుబ్బాక నియోజకవర్గంలోని తొగుట, దౌల్తాబాద్, చేగుంట, రాయపోల్, అక్బర్ పేట భూంపల్లి మండలాల నుంచి గజ్వేల్, సికింద్రాబాద్‌లకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సమస్యను మంత్రి దృష్టికి తీసుకవెళ్లారు. అదేవిధంగా నియోజకవర్గంలో రైతుల కోసం హైద్రాబాద్ సెక్రటేరియట్, కూకట్ పల్లి రైతు బజార్‌లకు గతంలో బస్సులు నడిపేవారన్నారు. రైతులు వెళ్లి తగిన గిట్టు బాటు ధరకు అమ్ముకొని ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. గతంలో మాదిరిగా బస్సులు నడిపించాలని మంత్రిని కోరామని చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

అంబలి కేంద్రాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ పట్టణంలో స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా శ్రీ మాత బొరంచమ్మ సరస్వతి మాత అలయ సముదాయం వద్ద ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని చైర్మన్ తొడుపునూరి చంద్ర పాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చే ఇంత మంచి కార్యక్రమాన్ని చేపట్టినందుకు ఆలయ కమిటీని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కమిటీ బాధ్యులు ఈరంటీ నారాయణ, ఊట్కూరి విరేశం, జంగిటి పరమేశ్వర్, మ్యాడం బలరాం, అర్చకులు గణేష్ పంతులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజానికి పునాది వేద్దాం

- అసిస్టెంట్ డైరెక్టర్ జోనల్ మలేరియా ఆఫీసర్ నాగయ్య



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలం సింగాటం గ్రామంలో గురువారం రాత్రి 8 గంటల నుండి 12 గంటల వరకు ఫ్రీ టాస్ మైక్రో ఫైలేరియా సీజనల్ సర్వేబృందం ఇంటింటికి తిరిగి ఫైలేరియా బ్లడ్‌స్మియర్ నిర్వహించినట్టు వరంగల్ అసిస్టెంట్ జోనల్ డైరెక్టర్ నాగయ్య తెలిపారు. గురువారం రాత్రి ఆయన మాట్లాడుతూ ఫైలేరియా సంబంధించిన రోగకారక క్రిములు ఏమైనా వ్యాప్తి చెందుతున్నాయా అని సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. ఇంటింటికి తిరిగి మురికికాల్వలను శుభ్రంగా ఉంచుకోవాలని నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకై ప్రత్యేక శ్రద్ధ వహించాలని దోమల వల్ల అనేక రకమైన వ్యాధులు సంక్రమిస్తాయని ఫైలేరియా, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గునియా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో పరిసరాలను కూడా అదే విధంగా శుభ్రంగా ఉంచుకోవాలని ఇంటి పరిసరాలలో నీటి నిలువ కుళాయిలను, ఎయిర్ కూలర్స్‌లలో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రమేష్ సిద్దిపేట్ శ్రీనివాస్, సబ్ యూనిట్ ఆఫీసర్ గజ్వేల్ హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, డి .నాగరాజు, ల్యాబ్ టెక్నీషియన్లు కోటేశ్వరరావు, బాల రాజేశం, ఫరీద్ ఖాన్, రమేష్ ఎఫ్ .ఎస్. ఓ.సిద్దిపేట. అహ్మదిపూర్ సూపర్‌వైజర్ శోభారాణి, ఆశావర్కర్లు వజ్రమ్మ నాగమణి, అంగన్వాడీ టీచర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

సీఐని సన్మానించిన బీఎస్‌పి నాయకులు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన జానారెడ్డిని శుకక్రవారం నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో బీఎస్‌పి నాయకులు సన్మానించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కూతాడి నర్సింలు, నాయకులు శాంత కుమార్, రవి గౌడ్‌లు సీఐని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు.

గృహజ్యోతి ఉచిత విద్యుత్ రశీదులు అందజేత



నవతెలంగాణ-బెజ్జంకి

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకంలో శుక్రవారం మండలంలో విద్యుత్ అధికారులు అర్హులైన గృహ వినియోగదారులకు సుమారు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ రశీదులు అందజేశారు. గృహ జ్యోతి పథకం రశీదులు అందని గృహ వినియోగదారులు అపోహలకు గురవ్వకుండా ప్రజాపాలన దరఖాస్తు వివరాలతో ఎంపీడీఓ కార్యలయంలో సంప్రదిస్తే వివరాలు నమోదు చేస్తారని బెజ్జంకి, తోటపల్లి విద్యుత్ శాఖ ఏఈలు చాంద్ పాషా, బాలకిషన్ సూచించారు. ఉచిత రశీదులు అందజేతలో ఆయా విద్యుత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ పథకం అమలు



నవతెలంగాణ-మిరుదొడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా ఉచిత విద్యుత్ పథకం అమలు కావడం జరిగిందని ఏఈ శ్రీకాంత్ తెలిపారు. ప్రభుత్వం 200 యూనిట్ల లోపు విద్యుత్ బిల్లుకు 100% సబ్సిడీ రావడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు . పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ కర్ణకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

25 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాదీనం

- హైకోర్టు, జేసీ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టిన అధికారులు

నవతెలంగాణ-బెజ్జంకి

హైకోర్ట్, జాయింట్ కలెక్టర్ ఆదేశానుసారం విచారణ చేపట్టి బెజ్జంకి శివారులోని సర్వే నంబర్ 962 యందు సుమారు 25 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమణదారుల నుంచి స్వాదీనం చేసుకున్నామని తహసిల్దార్ ఎర్రోల్ల శ్యామ్ తెలిపారు. బెజ్జంకి శివారులోని 962 సర్వే నంబర్ యందు అక్రమణకు గురైన భూమిపై న్యాయం కోసం బాధితులు హైకోర్టును అశ్రయించారు. హైకోర్టు, జాయింట్ కలెక్టర్ సూచన ప్రకారం విచారణ చేపట్టి ఆర్ఐ సుహాసిని, ఎస్ఐ క్రిష్టారెడ్డి సమక్షంలో భూమిని స్వాదీనం చేసుకున్నామని తెలిపారు. స్వాదీనం చేసుకున్న ప్రభుత్వ భూమిలో హెచ్చరిక సూచిక బోర్డ్ ఏర్పాటు చేసినట్టు తహసిల్దార్ తెలిపారు. స్వాదీనం చేసుకున్న ప్రభుత్వ భూమిని అక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు చేపడుతామని తహసిల్దార్ హెచ్చరించారు.

అధికారులు అన్యాయంగా వ్యవహరించారు

గత ముప్పై ఏండ్లుగా 962 సర్వే నంబర్ యందు వ్యవసాయం సాగు చేస్తున్నామని, భూమి సాగు చేస్తున్నవారికి సమాచారం ఇవ్వకుండా హుటాహుటిన ప్రభుత్వ భూమంటూ స్వాదీనం చేసుకొని అధికారులు అన్యాయంగా వ్యవహరించారని భూమిని సాగు చేస్తున్నవారు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వివరణ ఇచ్చుకోవడానికి అధికారులు సమయం ఇవ్వకపోవడం ఏకపక్షంగా వ్యవహరించడమేనని అసహనం వ్యక్తం చేశారు.



కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- జెడ్పి చైర్ పర్సన్ రోజా శర్మ

నవతెలంగాణ-సిద్దిపేట

పొద్దుతిరుగుడు కొనుగోలు కేందాద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తెలిపారు. శుక్రవారం సిద్దిపేట మార్కెట్ యార్డులో బిఆర్ఎస్ నాయకులు రాధాకృష్ణ శర్మ, సిద్దిపేట రూరల్ ఎంపీపీ శ్రీదేవి చందర్ రావు , పిఏసిఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, పిఏసిఎస్ సీఈవో కృష్ణ, ఏఎంసి సెక్రటరీ వెంకటయ్య, మార్కుఫెడ్ డి ఎం క్రాంతి, ఎంఈ మార్కుఫెడ్ లక్ష్మణ్ , హమాలీ కార్మికులు, రైతులతో కలిసి ఆమె కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో 7 చోట్ల ప్రొద్దుతిరుగుడు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే జిల్లాలో 5 కేంద్రాలు హుస్నాబాద్, కట్కూరు, బెజ్జంకి, తోగుటలలో ప్రజాప్రతినిధుల చేత, సిద్దిపేటలో తాను కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్బావం తర్వాత నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సిద్దిపేట జిల్లాలో నీటి కొరత లేకుండా పోయిందన్నారు. రైతులు వరి పంట తర్వాత ప్రొద్దుతిరుగుడు సాగుకు మొగ్గు చూపుతున్నారన్నారు. ప్రస్తుత మద్దతు ధర క్వింటాలుకు 6760/- ఉండగా బహిరంగ మార్కెట్‌లో 4000-4500/- మాత్రమే ఉన్నందున రైతులు నష్టపోకుండా ఈ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గతంలో కూడా సిద్దిపేట జిల్లాలో ప్రొద్దుతిరుగుడు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ సారి ఎమ్మెల్యే హరీశ్ రావు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ప్రొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై మాట్లాడటం జరిగిందన్నారు. అందుకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రజలకు మద్దతు ధర కోసం, అన్ని సౌకర్యాలతో సిద్దిపేటలో ఏర్పాటు చేసిన ప్రొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, హరీశ్ రావుకి, వ్యవసాయ మంత్రి తుమ్మలకు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.



ఇంటర్ పరీక్షలకు 9 మంది విద్యార్థుల గైర్హాజర్

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. 187 మంది విద్యార్థులకు 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు పరీక్షల నిర్వహణ అధికారి ధనరాజ్ తెలిపారు.

డప్పుతో ఢిల్లీ మనసును గెలిచిన భాస్కరుడు

- డప్పుకు పట్టం కట్టిన కేంద్ర ప్రభుత్వం.



నవతెలంగాణ -గజ్వేల్

దేశంలో వివిధ కళా రంగాల్లో విశిష్ట సేవలను అందిస్తున్న వారికి కేంద్ర ప్రభుత్వం సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ సంగీతవేత్త ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ పేరుమీద ప్రతి సంవత్సరం రాష్ట్రపతి యువ పురస్కారం అవార్డును అందిస్తుంది. ఈ సంవత్సరం "ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ " యువ పురస్కారంకు డప్పు మీద దరువులు ప్రజల హృదయాలను అలరిస్తున్న సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అందే గ్రామానికి చెందిన దళిత కళాకారుడు అందే భాస్కర్‌ని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. 6 మార్చి 2024 రోజున ఢిల్లీలో రాష్ట్రపతి ఈ అవార్డును అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు చల్ల శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం నాయకులు గుండ్ర నర్సయ్య, సాయి రాములు , ఈది దుర్గయ్య , డాకని బిక్షపతి , గూండ్ర నర్సింలు, ఈది శివులు, సోము నరేష్ , ఈది యాదగిరి , రాజీ లక్ష్మి నరసయ్య, సైదమ్ముల బలరాములు, సోము సురేష్, రాజు ప్రభు , నర్సి మల్లేశం , భూమిని మధు తదితరులు అభినందించారు..

యథేచ్ఛగా అక్రమ మట్టి రవాణ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని దాచారం గ్రామ శివారులోని తుమ్మల చెరువు శిఖం నుంచి యంత్రాలు, ట్రాక్టర్ల సహాయంతో శుక్రవారం యథేచ్ఛగా అక్రమ మట్టిని తరలిస్తున్నారు. అక్రమ మట్టి రవాణపై తహసిల్దార్ ఎర్రోల్ల శ్యామ్‌ను వివరణ కోరగా చెరువు శిఖం నుంచి మట్టి రవాణకు అనుమతుల్లేవని విచారణ చేపట్టి తగు చర్యలు చేపడుతామని తెలిపారు.

దొంగనే దొంగ దొంగ అన్నట్లు

- బీఆర్ఎస్ పార్టీ పర్యటన తీరు
- డీసీసీ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

దొంగనే దొంగ దొంగ అన్నట్లు బీఆర్ఎస్ పార్టీ మేడిగడ్డ పర్యటన ఉందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సారెడ్డి మాట్లాడుతూ చేసిన కోట్ల అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు దొంగనే దొంగ దొంగ అన్నట్టు ఉన్నదని ఆయన విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుప్పకూలిన తర్వాత కూడా బీఆర్ఎస్ పార్టీకి ఇంకా సిగ్గు రావడంలేదని ఆయన మండిపడ్డారు. కాగ్ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా బీఆర్ఎస్ పార్టీ నాయకులు పర్యటన చేయడం ఎంతవరకు సమంజసంమన్నారు. అవినీతి దోపిడీతో నాసిరకంగా నిర్మించి ప్రాజెక్టు వైఫల్యానికి కారణమైన పార్టీ నాయకులు, మాజీ మంత్రులు మేడిగడ్డ పర్యటన పేరిట కొత్త నాటకానికి తెరదీయడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ తప్పులు ఒప్పుకోక తప్పదన్నారు. మేడిగడ్డ పర్యటన చేసినందుకు రైతులకు వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నేషనల్ డ్యామ్స్ సెక్యూరిటీ అధికారులు మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణం సరిగా లేదని తేల్చారని, కాలేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరుగుతుందని ఆయన చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్ని డ్రామాలాడినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు.

బ్యాంకు సేవల గురించి విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-తొగుట

విద్యార్థులకు బ్యాంకింగ్‌పైన అవగాహన కల్పించామని ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్ ఫణి కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తొగుట బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్బిఐ ఆదేశాలనుసారం ఫైనాన్షియల్ లిటా రాసి వీక్‌లో భాగంగా ఆర్థిక అక్షరాస్యతపై ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు చిన్నమొత్తాల పొదుపుపై, సైబర్ నేరాల గురించి, బ్యాంకింగ్ సేవల గురించి వివరించారు. అంతకుముందు క్విజ్ పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపేందర్, తొగుట సిఎఫ్ఎల్ కౌన్సిలర్ స్వామి, సాయి కృష్ణ, శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్ పోటీ నిర్వహించడం ఈ పోటీలో విజేతలుగా నిలిచిన వారికి ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్ ఫణి కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందించారు.

పీఎం విశ్వకర్మ యోజన పథకం ఎంతో ఉపయోగకరం



నవతెలంగాణ-సిద్దిపేట

పిఎం విశ్వకర్మ యోజన పథకం వివిధ వృత్తిదారులకు ఎంతో ఉపయోగకరమని ఎమ్ఎస్ఎం ఈ అడిషనల్ డైరెక్టర్ దశరథం అన్నారు. శుక్రవారం పట్టణంలోని వయోల గార్డెన్‌లో పిఎం విశ్వకర్మ యోజన పథకం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్డిఏ పిడి జయదేవ్ ఆర్య, ఇండస్ట్రీస్ జిల్లా అధికారి గణేష్ రామ్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సరోజా, జిల్లా పంచాయతీరాజ్ అధికారి దేవకీ దేవి, ఎల్ డి ఎం సత్యజిత్, మెప్మా పిడి హనుమంత రెడ్డి, డిస్టిక్ మేనేజర్ ఫర్ కామన్ సర్వీస్ సెంటర్ మేనేజర్ శ్రీనివాస్ లు మాట్లాడుతూ కులానికి సంబంధించిన దృష్టితో కాకుండా వృత్తిని చేసుకునే పనిని బట్టి అందరికీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ స్కీంను అందరూ శ్రద్ధతో అనుసరించి, ఈ స్కీం ద్వారా వచ్చే బెనిఫిట్స్ పొందాలని సూచించారు. పంచాయతీ సెక్రెటరీలు గ్రామపంచాయతీలో నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారని, అందరూ కూడా ఆన్లైన్లో అప్లై చేసుకున్న తర్వాత వారి వారి కులవృత్తి కరెక్టా కాదా అని చెక్ చేసిన తర్వాత ఆన్లైన్లో అప్లోడ్ చేయడం జరుగుతుందని, అందరూ కూడా ఈ విధానాన్ని అనుసరించాలని కోరారు. ఈ పథకంలో భాగంగా మొదటి విడతలో లక్ష రూపాయలు, రెండవవిడుతలో 2 లక్షల రూపాయలు చెల్లిస్తారని, ట్రైనింగ్ పిరియడ్‌లో రోజుకు 500 రూపాయలు చెల్లిస్తారన్నారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాటల్లో ఈ పథకం పూర్తి వివరాలను వీడియో ద్వారా చూపించారు. ఈ కార్యక్రమంలో వివిధ వృత్తిదారులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని తునికి ఖాల్సా ప్రాథమిక పాఠశాలలో గురువారం పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులందరూ సాంస్కృతి కార్యక్రమాలను ముఖ్యంగా రైతు ఆత్మహత్యల సన్నివేశం, ప్రభుత్వ పాఠశాలల గొప్పతనానికి సంబంధించిన సన్నివేశం, బలగం, రామాయణం మొదలైన సన్నివేశ ప్రదర్శనలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. సుమారు ఐదు గంటల పాటు కొనసాగిన ఈ సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు ఒకరిని మించి ఇంకొకరు ప్రదర్శన చేసి విద్యార్థులు ఔరా అనిపించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఈఓ సునీత మాట్లాడుతూ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను పాఠశాల పనితీరును అభినందించారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నతమైన విద్యార్హతలు పొందిన టీచర్లు ఉంటారని నిబద్ధతతో టీచర్లు పనిచేస్తారన్నారు. కాబట్టి ప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లలను చేర్పించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని చెప్పారు. ఈ పాఠశాల మండలంలోనే ఆదర్శమైన పాఠశాలల్లో ఒక పాఠశాలగా నిలిచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. కృష్ణమోహన్రావు, పి.నాగరాజు, పులి రాజు, మంజుల, విమల శిరీష, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొని పిల్లలను అభినందించారు.

రాంసాగర్‌లో పడకేసిన పారిశుద్ధ్యం



నవతెలంగాణ-రాయపోల్

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి సుందరంగా తీర్చిదిద్దడం కోసం ప్రతిరోజు చెత్త చెదారం తొలగిస్తూ, ఎప్పటికప్పుడు మురికి కాల్వలను శుభ్రం చేయడానికి పారిశుద్ధ్య కార్మికులను నియమించి పల్లెలను పరిశుభ్రంగా ఉండేలా ప్రభుత్వం చూస్తుంది. కానీ రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలో కొత్తపల్లి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన ఉన్న మురికి కాల్వ గత కొద్ది రోజులుగా శుభ్రం చేయకపోవడంతో ఎక్కడి మురుగు నీరు అక్కడే నిలిచి దుర్వాసన వెదజల్లుతుంది. మురుగు కాలువలో నీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధిచెంది వ్యాధులు విస్తరించే అవకాశం ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురికి కాల్వలు శుభ్రం చేసి తగు చర్యలు తీసుకోవాలని రాంసాగర్ కోరుతున్నారు.

నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వేకు సహకరించాలి

- డాక్టర్ నిమ్రా తరుణమ్



నవతెలంగాణ-కోహెడ

ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకునేందుకు నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలతో కలిసి చేస్తున్న కేంద్ర బృందానికి ప్రజలు సహకరించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నిమ్రా తరుణమ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటా తిరుగుతూ ఆరోగ్య సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. అలాగే ఆరోగ్య సమస్యలు తెలుకొని వాటి పరిష్కర దిశగా కృషి చేస్తారన్నారు. ఆశా కార్యకర్తలు అడిగిన వివరాలను తెలియజేసి సహకరించాలని, ఈ సర్వే మండల కేంద్రంలో రెండు రోజులపాటు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్‌హెచ్ సభ్యులు, ఏఎన్ఎం గోవిందు మంజుల, ఆశా కార్యకర్తలు కొంకటి అశ్విని, వెల్దండి కవిత, మొగురం పద్మ పొన్నాల పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్స్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సు పోస్టు ఒకటి ఖాళీగా ఉందని ప్రాంతీయ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ సాయి కిరణ్ తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించే నర్సు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునే వారు జిఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్‌లో ఉత్తీర్ణులై, ఐదు సంవత్సరాల అనుభవం లేదా హెచ్ఐవి, ఎయిడ్స్ ఫీల్డ్ నందు ఒక సంవత్సరం అనుభవం గల బీఎస్సీ నర్సింగ్, కంప్యూటర్ పరిజ్ఞానం గల వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు 15 రోజుల్లో మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి నాలుగు గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కాంగ్రెస్. బీఆర్ఎస్ పార్టీలు చెల్లని రూపాయలు

- భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్



నవతెలంగాణ-కొమురవెల్లి

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు వేస్తే చెల్లని రూపాయి లెక్క అవుతాయని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం కొమురవెల్లి మల్లన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ తలపెట్టిన విజయ సంకల్ప యాత్ర ప్రచార రథానికి మల్లన్న సన్నిధిలో పూజలు నిర్వహించి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో ప్రారంభమైన ఈ యాత్ర పార్లమెంటు పరిధి మొత్తం కొనసాగుతుందన్నారు.నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. ఒక్క భువనగిరి పార్లమెంటు పరిధిలో తాను ఎంపీగా ఉన్నప్పుడు కేంద్రం నుంచి అధిక నిధులు తెచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉండడంతోనే ఇది సాధ్యమైందన్నారు. బీఆర్ఎస్ పార్టీపై పోరాటం చేసింది బీజేపీ ఒక్కటేనన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు చరమగీతం పాడారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. మూడోసారి దేశానికి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ అవుతారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జనగామ బీజేపీబిజెపి అధ్యక్షులు, గంగాడి మోహన్ రెడ్డి, ఆరుట్ల దేశమంత రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి, నియోజకవర్గ కో కన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకులు భైరవభట్ల చక్రధారి, మహిళా మోర్చా అధ్యక్షురాలు ఇర్రి ఉమా సురేషన్ రెడ్డి , జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ గౌడ్, బొంగుని సురేష్ గౌడ్, నాయకులు బూర్గోజు నాగరాజు, కొయ్యడ మల్లేశం, గణ బోయిన శ్రీనివాస్, సానాది కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మూరిని కలిసిన బెక్కల్ రామలింగేశ్వర స్వామి పాలకవర్గం



నవతెలంగాణ-మద్దూరు

జనగామ డిసిసి అధ్యక్షుడు నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో బెక్కల్ రామలింగేశ్వర స్వామి పాలకవర్గం శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రతాప్ రెడ్డిని కలిసిన వారిలో దూల్మిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ చొప్పరి మల్లేశం, కమిటీ సభ్యులు ఇమ్మడి శోభ, దారావత్ సరి రామ్, చెన్నోజు బ్రహ్మచారి, రాజపేట మల్లేశం, స్వర్గం సాంబయ్యలు ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ చొప్పరి మల్లేశం, మాట్లాడుతూ తనపై నమ్మకంతో బెక్కల్ రామలింగేశ్వర స్వామి చైర్మన్‌గా నియమించినందుకు కొమ్మూరి ప్రతాపరెడ్డికి, కాంగ్రెస్ నాయకులు కామిడీ జీవన్ రెడ్డి ,మేక మల్లేశం, జక్కిరెడ్డి సుదర్శన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సందిటి లక్ష్మి, నాయకులు ఆరే సాయిలు, పాకాల వెంకన్న, గద్దల మహేందర్, కోల సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శలో వంటగది నిర్మాణానికి శంకుస్థాపన



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయంలో వంటగది నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు ఒగ్గు దామోదర్, ముక్కీస రత్నాకర్ రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ సమ్మయ్య ప్రధానాచార్యులు హర్జీత్ కౌర్, సిబ్బందితో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక చొరవతో వంటగది నిర్మాణం చేపడుతున్నట్టు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కొమురవెల్లి

ఇటీవల బక్రిచేప్యాలలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి తడక లింగమూర్తి అన్నారు. శుక్రవారం కొమురవెల్లిలో ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షులు మంకాల నాగేష్, పట్టణ అధ్యక్షులు మంకాల శంకర్ లింగం అధ్యక్షులు మండల, పట్టణ కమిటీ సభ్యులతో కలిసి కొమురవెల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సోమవారం రాత్రి మహాత్మగాంధీ విగ్రహాన్ని ధ్వంసం దుండగులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ నాయకులు రావికంటి సత్యనారాయణ, జైన నరేష్, మంకాల ప్రసాద్, మంకాల రవి, నాగమల్ల బిక్షపతి, కాపర్తి మల్లికార్జున్, అంబటిపల్లి నాగరాజు, వీరేశం, అంబటిపల్లి లక్ష్మీ మల్లయ్య, ఉప్పల చంద్రశేఖర్, మంకాల సుధాకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
శనివారం | 02 మార్చి 2024 | www.navatelangana.com

తల్లిదండ్రులపైనే విద్యార్థుల భవిష్యత్తు



నవతెలంగాణ-తొగుట

విద్యార్థులకు చక్కని భవిష్యత్తు అందించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పరుశురాములు అన్నారు. గురువారం మండలంలోని గోవర్ధనగిరి మధిర గ్రామం చిన్న ముత్యంపేట (పిట్టల వాడ)లో విద్యా ప్రాముఖ్యత - పిల్లల భవిష్యత్తు పై సమావేశం ఏర్పాటు చేశా రు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ పిల్లలు సక్రమంగా పాఠశాలకు వెళ్లి, విద్యను అభ్యసిం చి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకునే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అందె ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కంతుల లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి భవిష్య త్తు నిర్మించుకోవాలని, చెడు వ్యసనాలకు గురి కావద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సీడీపీయూ జిల్లా కౌన్సిలర్ నర్సింలు, బాలిక హెల్ప్ లైన్ ఆఫీ సర్ లక్ష్మణ్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామేశ్వర్ రెడ్డి, అందె పాఠశాల పితాటి అశోక్, పద్మనాభుని పల్లి మాజీ సర్పంచ్ సింగర్ శ్రీనివాస్, సింగర్ జోసెఫ్, గ్రామ ప్రజలు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహ జ్యోతిని పకడ్బందీగా అమలు చేస్తాం

గజ్వేల్ ట్రాన్స్‌కో డిఈ సూర్య ప్రకాశ్



నవ తెలంగాణ- గజ్వేల్

గృహ జ్యోతిని పకడ్బందీగా అమలు చేస్తామని గజ్వేల్ ట్రాన్స్‌కో డి ఈ సూర్య ప్రకాష్ అన్నారు. శుక్రవారం నుంచి 200 యూనిట్లు విద్యుత్ వినియోగించే వారందరికీ గృహ జ్యోతి అందిస్తున్నామని తెలిపారు. గజ్వేల్ పట్టణంలో పలువురికి 200 యూనిట్ల జీరో బిల్లును అయన అందించారు. విద్యుత్ కమ్యూనికేషన్ మూలంగా గృహజ్యోతి దక్కని వారందరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన చెప్పారు. రెండవ ప్రజా పాలనలో దరఖాస్తు తో పాటు తక్షణమే ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగానే గృహాలకు 24 గంటల కరెంటు అందిస్తామని ఎలాంటి విద్యుత్ కోతలు ఉండవని ఆయన చెప్పారు. ఎప్పుడైనా మరమ్మతులు వస్తే తప్ప విద్యుత్తు విరామం ఉండదని ఆయనకు తెలిపారు. లోల్టేజ్ సమస్య ఎక్కడ ఉండదని ఆయన తెలిపారు.

లబ్ధిదారులకు జీరో విద్యుత్ బిల్లులు అందజేత









నవ తెలంగాణ - సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 200 యూనిట్ల లోపు గృహ జ్యోతి పథకం లబ్ధిదారులకు జీరో బిల్లులను శుక్రవారం పట్టణంలో విద్యుత్ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా ఏ డి ఈ రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో ఈరోజు నుండి అర్హులైన లబ్ధిదారులకు జీరో విద్యుత్ బిల్లులను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరెడ్డి, ఏ ఈ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మద్దూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గహజ్యోతి పథకంలో భాగంగా మద్దూరు మండల కేంద్రంలో లబ్దిదారులకు జీరో బిల్లు అందజేసినట్లు మద్దూరు ఏఈ సుధీర్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైను మెన్ పి శ్రీనివాస్, జేఎల్ఎం శ్రీనివాసరెడ్డి, రాజయ్య, సిద్దేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నవీద్ తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ-మర్కుక్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం(200యూనిట్లు) అమలుకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఉచిత విద్యుత్ జీరో బిల్లులను వినియోగదారుల మర్కుక్ విద్యుత్ ఏఈ సుధీర్ వినియోగదారుల శుక్రవారం అందజేశారు. మండల పరిధిలోని పాములపర్తిలో మాజీ సర్పంచ్ తిర్మల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్, చేబర్తి లో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరి, దామరకుంటలో కాంగ్రెస్ గ్రామాధ్యక్షులు పత్తి నర్సింలు యాదవ్ అధ్వర్యంలో గృహజ్యోతి పథకం వర్తింపు ఉచిత బిల్లులను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆశోక్, మాజీ వంటి మామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బబ్బూరి రాందాస్ గౌడ్, డీలర్ సంజీవులు, ఎం నారాయణ రెడ్డి, పెద్ది నర్సింలు, పాల స్వామి, కనకరాజు, రమేష్, యాదగిరి, జహంగీర్, కృష్ణ, స్వామి, వెంకటేష్ , విద్యుత్ సిబ్బంది గోవర్ధన్ రెడ్డి, సాయి, హనుమంతు తదితరులున్నారు.

నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం మైసంపల్లి గ్రామంలో గృహ జ్యోతి కార్యక్రమంలో భాగంగా లైన్ మెన్ రాజన్న, శ్రీకాంత్ గృహ వినియోగదారులకు జీరో కరెంట్ బిల్లులను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ముత్యాల యాదగిరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు గ్రామ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జనార్దన్ రెడ్డి, మహేందర్ రెడ్డి,కె.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జీరో బిల్‌తో ప్రజల్లో ఆనందం..!

-హుస్నాబాద్ డిఈ శ్రీనివాసులు



నవతెలంగాణ-అక్కన్నపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించినటువంటి గృహజ్యోతి పథకం ద్వారా అమలవుతున్నటువంటి 200 యూనిట్ల ఉచిత కరెంటు ప్రతి ఒక్కరికి అందుతోందని హుస్నాబాద్ ఎలక్ట్రికల్ డిఈ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి గ్రామంలో జీరో బిల్లులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ బిల్లులో కరెంటు వినియోగానికి సంబంధించిన రిపోర్టు ఇస్తూనే అమౌంట్ కూడా తెలుస్తుందని అన్నారు. అయితే జిజెఎస్ సబ్సిడీ కింద ఆ మొత్తం బిల్లు జీరో అయినట్లు చూపెడుతుందని అన్నారు. 200 యూనిట్లు దాటితే తప్పనిసరిగా బిల్లు కట్టాల్సి వస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ లైన్ మెన్ ధరావత్ రాజేందర్, విలేజ్ ఎలక్ట్రికల్ వర్కర్ అనిల్, స్పాట్ బిల్లర్ రతన్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

యాసంగి సాగులో సరైన పద్ధతులు పాటించాలి
జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



నవతెలంగాణ కొండపాక

జిల్లాలో ఎక్కడ కూడా యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ తెలిపాడు కొండపాక మండలం రాంపల్లి గ్రామంలో పలువురు రైతులకు చెందిన వరి పొలాలను శుక్రవారం పరిశీలించారు. . ఈ సందర్భంగా రైతులకు యాసంగి వరి సాగు చేసేటప్పుడు పాటించాల్సిన పద్ధతులను వివరించారు.యాసంగి వరి సాగులో సరైన పద్ధతులను పాటించాలని వివరించారు. ముందుగా విత్తనం ఎంచుకునే ముందు చౌడును , సల్ఫేడ్ దుష్ప్రభావం, మోగి పురుగును తట్టుకునే పరిశోధన రకాలైన జె జి ఎల్ 24423 ఎంచుకోవాలన్నారు. నారు దశలో కార్బాఫ్యూరాన్ త్రీ జి గుళికలు లేదా కార్తప్ హైడ్రోక్లోరిక్ 4జి గుళికలు వేయాలన్నారు. నాటు వేసేముందు నారు కొసలను తుంచి నాటుకోడం వలన మోగి పురుగు గుడ్ల సముదాయం నుంచి రక్షణ లభిస్తుందన్నారు. యూరియాను దఫా దఫాలుగా వేయాలన్నారు.

ధరణిలో ఏడు దరఖాస్తుల పరిశీలన



నవతెలంగాణ-మద్దూరు

ధరణి సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం మార్చి 1 నుండి 9 వరకు రెవెన్యూ సదస్సుల నిర్వహణలో భాగంగా మద్దూరు మండలంలో తహసిల్దార్ కార్యాలయం లో పెండింగ్లో ఉన్న 82 దరఖాస్తులను పరిశీలించేందుకు, ఐదుగురు చొప్పున రెండు బృందాలను వేసినట్లు తహసిల్దార్ అనంతరెడ్డి, శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .మొదటి బృందానికి టీం లీడర్ గా డిప్యూటీ తహసిల్దార్ గోపాల్ , సలాక్ పూర్, ధర్మారం రికార్డ్ అసిస్టెంట్ పి, వెంకటేష్, లక్క పల్లి, జూనియర్ అసిస్టెంట్,జి .అనిత, మర్మముల, రికార్డు అసిస్టెంట్, బి. సిద్దులు, నర్సాయపల్లి, గాగిల్లాపూర్, గ్రామాలకు అటెండర్, పి. రజినీకాంత్, రెండో టీం లీడర్ గా ఆర్ఐ. జి. రమేష్, వల్లంపట్ల, వంగపల్లి, జూనియర్ అసిస్టెంట్, ఏ. మౌనిక, రేబర్తి, జూనియర్ అసిస్టెంట్, బి. హైమ, లద్నూరు, ఏ.ఎస్.ఓ.ఆర్.మహేందర్, మద్దూరు, ధరణి ఆపరేటర్, శ్రీనివాస్ లతో రెండు టీములను వేసినట్లు ఆయన తెలిపారు. మొదటిరోజు సలాక్ పూర్, వంగపల్లి, వల్లంపట్ల, గ్రామాలలో 7 దరఖాస్తులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు

అమరవీరుల ఆశయ సాధన కోసం కృషి




నవతెలంగాణ-చేర్యాల

అమరవీరుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు భూమిగారి రాజేందర్ మాదిగ అన్నారు. మాదిగ అమరవీరుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అమరవీరులకు ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ గత30 సంవత్సరాల ఉద్యమ కాలంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని ఇప్పటికీ ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ముందుండి న్యాయం జరిగే వరకు పోరాడుతుందని, ఎస్సీ వర్గీకరణ జరిగితే అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ డైరెక్టర్,ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కర్రోల్ల ఎలీషా, భూమిగారి దామోదర్, చుంచు యాదగిరి,ఎర్రోళ్ల రమేష్, పంగ సిద్దులు,సుంచు నర్సింలు,భూమిగారి బిక్షపతి, పాకాల అనిల్, భూమిగారి విష్ణు,చుంచు తిరుపతి,భూమిగారి విజయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల నియోజకవర్గం,రెవిన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి

మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల నియోజక వర్గం తోపాటు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానని భువనగిరి మాజీ పార్లమెంటు సభ్యులు బూర నర్సయ్య గౌడ్ హామీ ఇచ్చారు. ఫిర్ ఏక్ బార్ మోడీ సర్కార్ అనే నినాదంతో తెలంగాణ బిజెపి పార్టీ తలపెట్టిన విజయ సంకల్ప యాత్ర శుక్రవారం చేర్యాలకు చేరుకుంది.ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ గతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేర్యాలను ఖండాలుగా విభజించిందని తద్వారా రెవెన్యూ డివిజన్ తో పాటు ఇతర శాఖలు వేరువేరు చోట్ల కేటాయించడంతో చేర్యాల ప్రాంత ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. భువనగిరి పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షులు అరుట్ల దశమంత రెడ్డి , మహబూబ్ నగర్ పార్లమెంట్ ఇంచార్జి కె వి ఎల్ ఎస్ రెడ్డి,బూరుగు సురేష్ గౌడ్, తోకల ఉమారాణి,నర్ర మహేందర్ రెడ్డి,కాశెట్టి పాండు, ముచ్చేంతల సిద్దారెడ్డి,సత్యవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ఏడుగురు గైర్హాజరు

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూడో రోజు జరిగిన ఇంటర్ పరీక్షలకు ఏడుగురు గైర్హాజరు అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ తెలిపారు. ప్రథమ సంవత్సర విద్యార్థులు 171మందికి గాను 164 మంది హాజరైనట్లు చెప్పారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం



నవ తెలంగాణ-మద్దూరు : కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలో ఇప్పటికీ నాలుగు అమలు చేసి ఇచ్చిన మాటపై నిలబడి ఉందని జాలపల్లి ఎంపీటీసీ చెట్కూరి కళ్యాణి కమలాకర్ యాదవ్ అన్నారు.ఈ సందర్భంగా దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామంలో విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు, తో కలిసి గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం గృహ జ్యోతి పథకం అమలు చేయడం హర్షనీయమని ఆమె అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, జనగామ నియోజకవర్గ ఇంచార్జ్ జనగామ జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డిలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఎల్ఎం సత్తయ్య కట్టర్ మల్లారెడ్డి, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

ఆస్తి పన్ను పెనాల్టీ పై 90శాతం వడ్డీ మాఫీ

నవ తెలంగాణ - సిద్దిపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మార్చి 2023 సంవత్సరం వరకు గల ఆస్తి పన్ను బకాయిల పైన పెనాల్టీ నుండి 90 శాతం వడ్డీ మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఆస్తి పన్ను పెనాల్టీ 90 శాతం రాయితి పొందుతూ, కేవలం 10 శాతం పెనాల్టీ తో ఈనెల 31 లోగా చెల్లించి, పురపాలక సంఘ కార్యాలయానికి సహకరించాలని కోరారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

నవ తెలంగాణ-సిద్దిపేట : జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ పరీక్షల సెంటర్ లను జిల్లా కలెక్టర్ మిక్కిలి నేని మను చౌదరి శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సెంటర్ లలో తాగునీరు, టాయ్ లెట్ ఇతరత్ర వసతులు తప్పని సరి కల్పించాలని, పరీక్ష గదిలోకి వెళ్ళడానికి విద్యార్థులు అర్థం అయ్యే విధంగా సైన్ బోర్డు ఏర్పాటు చేయాలని, మొబైల్ ఫోన్లు ఇతరత్ర వస్తువులు తీసుకెళ్ల కుండా పకడ్బందీగా చెక్ చేయాలని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి సూర్యప్రకాశ్ కు సూచించారు. పరీక్ష గదిలో బోర్డు పైన హాజరు కాని, హజరైన విద్యార్థుల సంఖ్య ను తప్పనిసరిగా రాయాలని ఇన్విజిలేటర్ కి తెలిపారు. సిసి కెమెరాలు టివిని పరిశీలించారు. పరీక్ష సెంటర్ చుట్టూ ఎలాంటి అవరోధాలు ఎదురవ కుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చెయ్యాలని పోలిస్ అధికారులకు తెలిపారు.

అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-తొగుట : పెరిగి పోయిన అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్ఐ బి.లింగం తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన చింత కుమార్ (39) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పని ఉందని చెప్పి గురువారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్ళిపోయాడు. ఉదయం తొగుట గ్రామ శివారులో చింత కుమార్ పురుగుల మందు తాగి మృతి చెంది ఉన్నాడని కుటుంబ సభ్యులకు తెలిసింది. విషయం తెలుసు కున్న భార్య చింత కవిత, కుటుంబ సభ్యులు కలిసి వెళ్లి చూసేసరికి చింత కుమార్ పురుగుల మందు తాగి మృతి చెంది వున్నాడు. తన భర్త కుమార్ గత కొద్ది సంవత్సరాల క్రితం వరి కోత మిషన్, డీసీఎం బండ్లను అప్పుచేసి కొనుగోలు చేసినట్లు మృతుడి భార్య కవిత తెలిపారు. వరి కోత మిషన్ (అర్వెస్టర్), డీసీఎం కొద్ది రోజులు నడిపించగా అవి సరిగ్గా నడవక పోయేసరికి వాటి కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి పోయాయని తెలిపారు. అప్పులు పెరిగి పోవడంతో అప్పులు కట్టలేక వరి కోత మిషన్, డీసీఎం, తన ఇంటి స్థలాన్ని అమ్మగా వాటితో వచ్చిన డబ్బులతో కొంత వరకు అప్పులు తీర్చాడు. కట్టిన అప్పులు పోను మరో రూ. 30 లక్షల అప్పులు మిగిలి ఉన్నాయని వాటిని ఎలా తీర్చాలంటూ తీవ్ర మనస్థాపానికి గురై గుర్తు తెలియని పురుగుల మందు తాగి మృతి చెందినట్లు చెప్పింది. మృతునికి కూతురు అక్షయ, కొడుకు అభిలాష్‌లు ఉన్నారు. మృతుడి భార్య చింత కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గాడిపల్లిని పరామర్శించిన నర్సారెడ్డి

నవ తెలంగాణ- గజ్వేల్ : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్‌ను శుక్రవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి కేర్ ఆస్పత్రిలో పరామర్శించారు. భాస్కర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. భాస్కర్ కు ఇటీవల కేర్ ఆస్పత్రిలో గుండెకు సంబంధించిన ఆపరేషన్ జరిగింది. పరామర్శించిన వారిలో గొల్లపల్లి నరేందర్ రెడ్డి ఉన్నారు.

వేసవిలో ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-మర్కుక్

వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని మర్కుక్ ఎంపీడీవో అఫ్జల్‌ఖాన్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో ఉపాధి హామీ కూలీల పనిచేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవి దృష్టిలో ఉంచుకుని కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని, పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్ ఉపాధి హామీ టిఏ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ లలిత ఉన్నారు.

సుమేశ్‌ను కాల్చి చంపిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవ తెలంగాణ - సిద్దిపేట

ఉత్తరప్రదేశ్‌లోని సిలైబర గ్రామంలో దళిత విద్యార్థి సుమేశ్(17)ను అన్యాయంగా కాల్చి చంపిన ఉత్తరప్రదేశ్ పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకొని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొమ్ము విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజుతో కలిసి సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మీసం మహేందర్, వడ్లకొండ రవీందర్, నరేష్ , రాజు , జయంత్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవో నేతలు





నవ తెలంగాణ - సిద్దిపేట

జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన మిక్కిలినేని మను చౌదరిని మర్యాద పూర్వకంగా కలిసినట్టు తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రమ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు అందరూ కలసి పని చేసి జిల్లాకు మంచిపేరు తీసుకొని రావాలని కలెక్టర్ కోరారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా అసోసియేట్ అధ్యక్షులు సురేందర్ రెడ్డి, వినయ సుకుమారి , సుజాత, పోతుల సత్యనారాయణ, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు నగేష్ , నరేష్ , శ్రీధర్ , సాయి , సుమన్, కలెక్టర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల

సిద్దిపేట జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన మిక్కిలినేని మనో చౌదరిని టీఎన్జీవో యూనియన్ ఉద్యోగులు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. జిల్లాకు బదిలీపై వచ్చిన మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి సావిత్రిని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్ప, ఉపాధ్యక్షురాలు తాటిపాముల కృష్ణవేణి, చేర్యాల ప్రాజెక్టు అధ్యక్షురాలు అరుణ, ప్రాజెక్టు సలహాదారు శోభ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవం





నవతెలంగాణ- రాయపోల్

పాఠశాల స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా ఐదవ తరగతి విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి పాఠశాలలో మిగతా విద్యార్థులకు విద్యాబోధన చేశారని రాయపోల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అబ్దుల్ అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రం ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు షేక్ అబ్దుల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు స్వయంగా ఉపాధ్యాయుల విధుల పట్ల పాఠశాల విధులు, సమాజం తీరు పై అవగాహన కలిగే విధంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఐదవ తరగతి విద్యార్థులు డీఈవో కె.దీక్షిత, ఎంఈఓ బి.ప్రణయ్ తేజ, ప్రధానోపాధ్యాయురాలు బి.అక్షిత వీరు ఈ పాత్రలు వహించారు..ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భాస్కర్,సురేష్ కుమార్,విజయ,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం నర్మెట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. పాఠశాలలో పైతరగతి విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తమ తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా దీపిక, డిఈఓగా లాస్య, ఎంఈఓగా వర్షిత్, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ గా యశ్వంత్, ఉపాధ్యాయులుగా రుచిత, సహస్ర, భావన, సంజన ,ప్రణవి, వైశాలి, రాధిక, వర్షిత్, సాకేత్, శ్రీనాథ్, మణికంఠ, నితీష్, అఖిల్, ప్రణయ్, సాకేత్, మణిదీప్ వ్యవహరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎనగందుల మనీష్ కుమార్, ఉపాధ్యాయ బృందం బి. సీతారాములు, కె. శ్రీనివాస్, జి. శ్రీకాంత్, సి.హెచ్. పద్మ, పి. శారద పర్యవేక్షించి అభినందనలు తెలియజేశారు.

వర్గీకరణ సాధనే మాదిగ అమరులకు నిజమైన నివాళి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మైస రాములు మాదిగ



నవతెలంగాణ -గజ్వేల్

మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తాలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. శుక్రవారం ఈ కార్యక్రమం ఎమ్మార్పిస్ మండల అధ్యక్షులు ఉబ్బని అంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఎమ్మెస్పి రాష్ట్ర నాయకులు మైస రాములు మాదిగ మాట్లాడాతూ జాతి అస్థిత్వం కోసం,ఆత్మగౌరవం కోసం, హక్కుల కోసం తృణప్రాయంగా ప్రాణాలు అర్పించిన వీరులు ఎల్లప్పుడూ మాదిగ ప్రజల గుండెల్లో నిలిచి ఉంటారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ జరగడం ద్వారా తప్ప మాదిగలకు సామాజిక ఆర్థిక రాజకీయ అభివృద్ధి చెందడానికి మరో మార్గం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించేంత వరకు ఉద్యమం ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పి గజ్వేల్ నియోజకవర్గ కో-ఇంచార్జ్ శ్రీహరి చిందు, మార్కుక్ మండల ఇన్‌ఛార్జీ బొమ్మని మహేష్ మాదిగ, రవి మోచి, సీనియర్ నాయకులు గద్దల సుధాకర్ మాసన్‌పల్లి అశోక్, బుర్కి ప్రశాంత్, వేణు మోచిపొట్ట కర్నాకర్, అహ్మదిపూర్ రాజు,ప్రసాద్ యాదవ్, సురేందర్ మోచి,గంగాధర్ తదితరులు పాల్గొన్నారు,

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరులకు నివాళులు



నవతెలంగాణ-మద్దూరు

మాదిగ ఉపకులాల అభ్యున్నతి కోసం పాటుపడుతూ. ఏబిసిడి వర్గీకరణ. అమలును కొట్టివేయడంతో జీర్ణించుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సుందరగిరి భాస్కర్, ఆధ్వర్యంలో శుక్రవారం దూల్మిట్ట మండల కేంద్రంలో ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మాదిగ ఉపకులాల ఏబిసిడి వర్గీకరణన రిజర్వేషన్ల అమలు చేయాలని.వర్గీకరణ రిజర్వేషన్లు అమలు చేయడంలో రాష్ట్రాలకు అధికారం లేదని సుప్రీంకోర్టులో దావా వేసి ఏబిసిడి వర్గీకరణ అమలును కొట్టివేయడంతో. ఎంతోమంది మాదిగలు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగులపల్లి రాములు, చిలుక వెంకటయ్య, వేణు, మాజీ సర్పంచ్ గద్దల చంద్రయ్య, నాయకులు గద్దల మహేందర్, పోతరాజు కనకయ్య, ముంగి బాలరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

నవ తెలంగాణ - సిద్దిపేట

ఎస్సీ రిజర్వేషన్ ల వర్గీకరణ లక్ష్య సాధనలో జాతి బిడ్డల భవిష్యత్తే ముఖ్యమని ఎమ్మార్పీఎస్ నాయకుడు కొలిమి మల్లేశం మాదిగ తెలిపారు. మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బింగి పవన్ కళ్యాణ్, దాకాని యాదగిరి, పెర్క ప్రశాంత్, గాజుల తిరుపతి, గాజుల స్వామి, కుమార్, రామ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

